Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




| కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 15 | శనివారం | అక్టోబర్ 10, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 03 | Issue No : 15 | Saturday | 10 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



14న విజయవాడకు విచ్చేస్తున్న

## రాష్ట్రపతి

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ :

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.

- మిగతా 2లో..



## నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు

రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరు మెరుగుపరుచుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి, ప్రకాశం:

నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.



2 లో..



బీసీలకు 34 శాతం

## రిజర్వేషన్లు నో..

ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు!

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిరాకరణ
- ప్రభుత్వ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- 34 శాతం రిజర్వేషన్లకు ఆగస్టులో ప్రభుత్వం ఉత్తర్వుల జారీ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ :

ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి సుప్రీంకోర్టులోనూ అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి న్యాయపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. గతంలో ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

2 పేజీలో..

జగన్మాత దివ్య దర్శన్

## టికెట్లను విడుదల

'మన మిత్ర' వాట్సాప్ ద్వారా అక్టోబర్ 11, 12, 13 తేదీల టికెట్లు అందుబాటులోకి

- రూ.1,000 రుసుముతో కుమ్మరిపాలెం నుండి ఉచిత బస్సు రవాణా
- ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి ముఖ మండప (బంగారు వాకిలి) దర్శనం

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 11వ తేదీ నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సామాన్య భక్తులు ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా అమ్మవారిని దర్శించుకునేం దుకు ప్రవేశపెట్టిన "జగన్మాత దివ్య దర్శన్" ప్రత్యేక టికెట్ల కోటాను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ శుక్రవారం మధ్యాహ్నం 02:00 గంటలకు అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల తొలి మూడు రోజులైన అక్టోబర్ 11, 12, 13 తేదీలకు సంబంధించిన టికెట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ (9552300009) ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మూలా నక్షత్రం రోజు మినహాయించి అన్ని రోజులకు విడతల వారీగా దర్శనం టిక్కెట్లు విడుదల చేస్తామని ఈవో తెలిపారు.



"జగన్మాత దివ్య దర్శన్" విశేషాలు & సౌకర్యాలు:
టికెట్ రుసుము ఒ ఉచిత రవాణా: ఈ టికెట్ ధర రూ. 1,000/- గా నిర్ణయించారు. 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను కుమ్మరిపాలెం సెంటర్ వద్ద గల టిటిడి స్థలం నుండి దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఉచితంగా కొండపైకి చేరవేస్తారు.
ముఖ మండప దర్శనం : కొండపైకి చేరుకున్న

2 పేజీలో..



సంజీవని ఆరోగ్య సేవలను ప్రారంభించడానికి జిల్లాలు సర్వసన్నద్ధం

## కావాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న సంజీవని ఆరోగ్య సేవల అమలుకు జిల్లాలన్నీ సర్వసన్నద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమన్వయంతో కూడిన నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, ఐటీ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, వర్చువల్ వైద్య సంప్రదింపుల గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ల నియామకం,వైద్య సిబ్బందికి శిక్షణ,ఆరోగ్య కేంద్రాల నమోదు ప్రక్రియలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని, కలెక్టర్లు ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.

- మిగతా 2లో..

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.



జనసేన ఎమ్మెల్యేపై పవన్ కల్యాణ్

## సీరియస్..

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.

2 లో..



మంచినీరు చౌర్యం చేస్తే వెంటనే

## అరెస్టు చేయాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- తాగునీటిని చేపలు, రొయ్యల చెరువులు వంటి తాగునీటేతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, పట్టణ గ్రామీణ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- మిగతా 2లో..

కేంద్ర బలగాల పహారాలో స్థానిక సంస్థల

## ఎన్నికలు నిర్వహించాలి



- ఎన్నికలు పూర్తయ్యే వరకు అభ్యర్థులకు పూర్తి భద్రత కల్పించాలి
- జిల్లా కేంద్రాల్లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరించాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరిన వైఎస్సార్సీపీ

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :

ఆంధ్రప్రదేశ్ లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ అభ్యర్థులకు తగినంత భద్రత ఇవ్వాలని, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను జిల్లా కేంద్రాల్లో సమర్పించేందుకు అవకాశం కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. అలాగే వీటి కాపీల్ని కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా పంపారు.

2 పేజీలో..




అమెరికాలో భారత

## ఐటీ కంపెనీలకు షాక్..

- గ్రీన్‌కార్డ్ దరఖాస్తులపై తాత్కాలిక నిషేధం!

వాషింగ్టన్: అమెరికాలో పనిచేస్తున్న భారత ఐటీ కంపెనీలకు అక్కడి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. శాశ్వత కార్మిక ధ్రువీకరణ కార్యక్రమం (పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) కింద దరఖాస్తులపై తాత్కాలిక నిషేధం విధించారు. ఈ నిర్ణయం కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ వంటి సంస్థలపై ప్రభావం చూపనుంది.

2 పేజీలో..

# ప్రజాభూమి

శనివారం, అక్టోబర్ 10, 2026




## సంపాదకీయం

# నోబెల్ పై ట్రంప్ ఆశలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్కోవ్స్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రుసరుసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశు భ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు.2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది.

## జగన్మాత దివ్య దర్శన్" టికెట్లను విడుదల

భక్తులను ఓం టర్నింగ్ వద్ద గల ప్రత్యేక క్యూలైన్ ద్వారా అనుమతించి, ఆలయ అంతర్భాగంలోని ముఖ మండపం (బంగారు వాకిలి) నుండి శ్రీ జగన్మాత కనకదుర్గ అమ్మవారిని అత్యంత సమీపంగా దర్శించుకునే భాగ్యం కల్పిస్తారు.

**సులభతరమైన బుకింగ్ :** భక్తులు తమ మొబైల్ ఫోన్లలో 9552300009 వాట్సాప్ నెంబర్ ద్వారా కొన్ని నిమిషాల్లోనే సులభంగా తమ టికెట్లను రిజర్వ్ చేసుకోవచ్చు.ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సామాన్య భక్తులు ముందస్తుగా టికెట్లు నమోదు చేసుకోవాలని, ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నిర్దేశిత సమయంలో విచ్చేసి సౌకర్యవంతంగా అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఈవో వి.కె. శీనా నాయక్ కోరారు. రూ. 500/-, 300/-, 100/- టిక్కెట్లు రద్దు చేసి ఉదయం 4 నుండి రాత్రి 11 వరకు 4 క్యూ లైన్లు ద్వారా అందరికి ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు, స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు ఉదయం 6 నుండి 8 వరకు, మళ్ళీ రాత్రి 7.45 నుండి 9.45 వరకు రూ. 1000/- టికెట్ దర్శనం కేవలం 4 గంటలే ఉంటుండగా,జగన్మాత దివ్య దర్శన్ ద్వారా ఏ సిఫార్సు లేకుండా సామాన్య భక్తులకు 8 గంటలపాటు రూ. 1000/- టికెట్ పై ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

## జనసేన ఎమ్మెల్యేపై పవన్ కల్యాణ్ సీరియస్..

ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## అమెరికాలో భారత ఐటీ కంపెనీలకు షాక్..

అమెరికా కార్మికుల ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ కంపెనీల నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరించబోమని, ఇప్పటికే దాఖలైన దరఖాస్తులపైనా చర్యలు తీసుకోబోమని ఆయన వెల్లడించినట్లు పేర్కొన్నారు. 2009 నుంచి ఈ కంపెనీలు విదేశీ ఉద్యోగుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నాయని సోండర్లింగ్ ఆరోపించారు. అమెరికా 2.30 లక్షల హెచ్-1బీ వీసాలను ఆమోదించిందని, లక్ష శాశ్వత కార్మిక ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేసిందని తెలిపారు. ఈ కంపెనీలు అమెరికా కార్మికుల ఉద్యోగాలను దెబ్బతీశాయని ఆయన విమర్శించారు.మైక్రోసాఫ్ట్‌పైనా సోండర్లింగ్ ఆరోపణలు చేశారు. సుమారు 6,000 మంది అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానాల్లో వేలాది మంది విదేశీ ఉద్యోగులను నియమించడం ద్వారా అమెరికా ఉద్యోగ వ్యవస్థను దుర్వినియోగం చేసిందని పేర్కొన్నారు.మరోవైపు, అమెరికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే చర్యల్లో భాగంగా హెచ్-1బీ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలపై విధిస్తున్న 1,00,000 డాలర్ల రుసుమును మరో ఏడాది పాటు పొడిగించినట్లు కథనంలో పేర్కొన్నారు.

# నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం :**
గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**
ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'..**
**అధికారులకు చురకలు**
ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండెపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని**
**కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**
రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**
ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# మంచినీరు చౌర్యం చేస్తే వెంటనే అరెస్టు చేయాలి




సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఏపీ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ అంశాలపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.మంచి నీటిని తాగునీటేతర అవసరాలకు అనగా చేపలు, రొయ్యల చెరువులకు మళ్ళించి కుండా చూడాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.ఎక్కడైనా ఎవరైనా తాగునీటి చౌర్యానికి పాల్పడితే వారిని వెంటనే అరెస్టు చేయించాలని ఆదేశించారు. రానున్న ఆరు మాసాలు తాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సాయి ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రంలో అక్టోబర్ 8 నాటికి సాధారణ వర్షపాతం కంటే 38.9 శాతం లోటు నమోదైందని, 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో పంట నష్టం అంచనాలను ఈ నెల 17లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులకు ప్రభుత్వ మద్దతు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య హెచ్చరికలను క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిశీలించి,పెండింగ్ వివరాలను పూర్తి చేయాలన్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయడం, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా, బోర్ల మరమ్మతులు, నీటి వనరుల సంరక్షణ, లీకేజీల నివారణ చేపట్టాలని సూచించారు. 2027 వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లా స్థాయిలో పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఉద్యాన పంటల పరిరక్షణకు సూక్ష్మ సేద్యం, వ్యవసాయ కుంటలు, సేంద్రియ మల్చింగ్, అవసరమైన రైతులకు అత్యవసర నీటి సరఫరా వంటి చర్యలను వేగవంతం చేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ పట్టణ స్థానిక సంస్థల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించామని వివరించారు.23 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేక సమ్మర్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. రానున్న ఆరు మాసాల్లో ఎక్కడా తాగునీరు అందలేదని ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు.రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై ప్రెజెంటేషన్ ఇస్తూ ఎల్నినో వల్ల రాష్ట్రంలో 514 మండలాలు ప్రభావితం కాగా ఇప్పటికే 388 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని తెలిపారు.తాగునీటి ఎద్దడి అధికంగా ఉండే మండలాల్లో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రతి పాదనలు సిద్దం చేసినట్టు చెప్పారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజతో పాటు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## 14న విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి

రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

### సంజీవని ఆరోగ్య సేవలను ప్రారంభించడానికి

## జిల్లాలు సర్వసన్నద్ధం కావాలి



వైద్య సదుపాయాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. అలాగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు నీరు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణ చర్యలు, ప్రతి శు క్రవారం డ్రై డే నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో క్రిమిసంహారక చర్యలు, దోమతెరల పంపిణీని సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. తాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్లోరినేషన్, నీటి నమూనాల పరీక్షలు, పైపులైన్ల లీకేజీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, సెకండరీ హెల్త్ కమిషనర్ చక్రదరబాబు తో పాటు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు నో..



సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ప్రస్తుతానికి అడ్డంకి ఏర్పడింది. ఈ రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయని హైకోర్టు గతంలో పేర్కొంది. ఆ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. వెనకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్న ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20న గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించి జీవో 105 జారీ చేసింది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆగస్టు 19న మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయాలపై న్యాయస్థానాల్లో సవాళ్లు ఎదురయ్యాయి. 2020లోనూ 34 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు సాధారణంగా 50 శాతం మించకూడదు. అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలంటే వెనుకబాటుతనంపై సమగ్ర అధ్యయనం, విశ్వసనీయ గణాంకాలు అవసరమని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టు తాజా నిర్ణయం రాష్ట్రంలో రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# కేంద్ర బలగాల పహారాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (జ్యూరాఫీ) మోహరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.

కేంద్ర సాయుధ పోలీసు బలగాలను తగిన సంఖ్యలో మోహరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. కేంద్ర బలగాల మోహరింపు ఎన్నికల సంఘం సమర్థవంతమైన పర్యవేక్షణలో జరగాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రాజకీయ బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల భద్రత బాధ్యతలను పూర్తిగా రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే నిష్పక్షపాత వాతావరణం ఉంటుందన్న నమ్మకం తమకు లేదన్నారు. కూటమి పాలనలో ప్రతిపక్ష అభ్యర్థులు బెదిరింపులు, దాడులు, రాజకీయ ప్రేరేపిత పోలీసు చర్యలు, రాజకీయ కార్యకలాపాలకు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని లేఖలో వెల్లడించారు. ఈ పరిస్థితులు ఎన్నికల సమయంలో మరింత తీవ్రమై, ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయడం, ప్రచారాన్ని నిరోధించడం వంటి పరిణామాలకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క పోలింగ్ రోజు మాత్రమే భద్రత కల్పించడం సరిపోదని, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందే కేంద్ర బలగాలను మోహరించి, ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు ప్రకటించే వరకు కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, ప్రతిపాదకులు, మద్దతుదారులపై ఒత్తిళ్లు తీసుకురావడం ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతుందని లేళ్ల అప్పిరెడ్డి లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాలు, వార్డుల వంటి సన్నిహిత సమాజాల్లో బెదిరింపులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిపక్ష అభ్యర్థులు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు తమ చట్టబద్ధమైన ఎన్నికల బాధ్యతలను నిర్వహించకుండా పోలీసు అధికారాలను ఉపయోగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఎవరు పాల్గొనాలి, ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే అంశాలను అధికార పార్టీ ప్రభావం లేదా ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం నిర్ణయించకూడదని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి దృశ్యాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని అప్పిరెడ్డి కోరారు.

సున్నితమైన ప్రాంతాల్లో స్వతంత్ర పరిశీలకులు, మొబైల్ పర్యవేక్షణ బృందాలను నియమించాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు వివక్ష లేకుండా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, అధికార యంత్రాంగాన్ని లేదా ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అలాగే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను జిల్లా కేంద్రాల్లో సమర్పించేందుకు అవకాశం కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. అభ్యర్థులు భయం, బెదిరింపులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ సదుపాయం కల్పించాలని కోరారు. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, రసీదుల జారీ, సంబంధిత అధికారులకు పత్రాల బదిలీ ప్రక్రియలో స్పష్టమైన విధానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనుల్లో జాప్యంపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం






## గడువు పొడిగించినా పురోగతి లేకపోవడంపై అసంతృప్తిపనులు వేగవంతం చేయకుంటే కాంట్రాక్టు రద్దుపై చర్యలు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల్లో జాప్యంపై రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో హార్బర్ నిర్మాణ ప్రదేశాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీ లించి, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించారు. నిర్మాణ పనుల గడువును ఇప్పటికే రెండుసార్లు పొడిగించినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను తక్షణమే వేగవంతం చేయాలని, ఇదే నిర్లక్ష్యం కొనసాగితే కాంట్రాక్టు రద్దు చేసే అంశాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**మత్స్యకారుల ప్రయోజనాలను విస్మరించొద్దు**

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి గతంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో చర్యలు ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతర కాలంలో అంచనా వ్యయం పెరగడం, నిర్మాణ బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి అంశాలపై అధికారులను ఆరా తీశారు. నిర్మాణ పనుల బాధ్యతలు మారినప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.మత్స్యకారుల జీవనోపాధికి, వారి ప్రయోజనాలకు కీలకమైన ఈ ప్రాజెక్టు పూర్తిలో జాప్యం జరగడం వల్ల ప్రజలకు నష్టం కలుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**

పనులు సకాలంలో పూర్తిచేయడంలో విఫలమైన కాంట్రాక్టర్‌పై ఇప్పటివరకు ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదని అధికారులను మంత్రి ప్రశ్నించారు. గడువులు పొడిగించినా పనులు ముందుకు సాగకపోవడానికి గల కారణాలను కాంట్రాక్టర్ ప్రతినిధులు స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. పనుల పురోగతి, ఇప్పటివరకు చేసిన వ్యయం, మిగిలిన పనులు, గడువుల పొడిగింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో సమీక్షించారు.

**శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష**

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులపై శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, పూర్తి చేయాల్సిన నిర్మాణాలు, అవసరమైన వనరులు, కాంట్రాక్టర్ పనితీరు తదితర అంశాలపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. పనులను వేగవం తం చేసేందుకు అవసరమైన చర్యలతోపాటు, కాంట్రాక్టుపై తదుపరి నిర్ణయాలను నిబంధనల ప్రకారం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పనులు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ**

ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పగటిపూట శాఖాపరమైన విధులు నిర్వహించిన అనంతరం రాత్రి వేళల్లోనూ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని పేర్కొన్నారు. నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఫోన్‌లో మంత్రితో మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పనుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. కాంట్రాక్టర్ పనితీరు, నిర్మాణ పురోగతి, గడువులు, నిబంధ నల ఉల్లంఘనలపై సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ, మత్స్యకారుల ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ ఆకస్మిక తనిఖీలో మచిలీపట్నం డీఎస్పీ, మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో 11 నుంచి 20 వరకు దసరా మహోత్సవాలు

### శక్తిపీఠం పీఠాధిపతి శ్రీ కరుణానందనాథ స్వామి

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ, శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20 తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ స్వామి (కరుణ స్వామి) చెప్పారు. శుక్రవారం పాల ఫ్యాక్టరీ సమీపంలోని సివిఆర్ ఫ్లైఓవర్ వద్ద ఉన్న శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీన అమ్మవారిని శ్రీశైల పుత్రి దేవి అలంకారంతో, 12వ తేదీన శ్రీ బ్రహ్మచారిణి దేవి అలంకారంతో, 13వ తేదీన శ్రీ చంద్రఘంట దేవి అలంకారంతో, 14వ తేదీన శ్రీ కుష్మాండ దేవి అలంకారంతో, 15వ తేదీన శ్రీ స్కందమాత దేవి అలంకారంతో, 16వ తేదీన శ్రీ కాత్యాయని దేవి అలంకారంతో అమ్మవారి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. అలాగే 17వ తేదీన శ్రీ కాళరాత్రి దేవి అలంకారం, 18వ తేదీన శ్రీ మహా గౌరీ దేవి అలంకారం, 19వ తేదీన శ్రీ సర్వసిద్ధి దేవి అలంకారం, 20వ తారీఖున విజయదశమి సందర్భంగా శ్రీ మహామారి కరుమారి దేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. 20వ తేదీ సాయంత్రం అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని, అలాగే శమీ పూజోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. గత 16 సంవత్సరాల క్రితం శక్తిపీఠంలో అమ్మవారు స్వయంభూగా వెలిశారని, ఆనాటి నుండి ప్రతి ఏటా శక్తి పీఠంలో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో పీఠం ట్రస్ట్ సెక్రటరీ జ్ఞానేశ్వర్, ఆహ్వాన కమిటీ కార్యదర్శి కొరగంజి హేమంత్ కుమార్, మాతృమండలి అధ్యక్షురాలు బాలా త్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు లంకమ్మ ప్రసాద్ సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు అశ్వారావుపాలెం మాజీ సర్పంచ్, జనసేన పార్టీ నాయకులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ సత్కరించారు. జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ నియమించిన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కో-ఆర్డినేషన్ మచిలీపట్నం పార్లమెంటు కమిటీలో నిర్వాహక్ దళ్ సభ్యునిగా తనను నియమించిన సందర్భంగా ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా లంకమ్మ ప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గ యువనాయకులు, స్థానిక సంస్థల మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మండలి వెంకట్రామ్ నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా సమిష్టి కృషి చేస్తానన్నారు.

# శ్రీ జలధీశ్వర స్వామి ఆదాయం రూ.3,46,723

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

ఘంటసాల గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జలధీశ్వర స్వామి దేవస్థానం ఈవో తోట చెన్నకేశవ మాట్లాడుతూ నడకుదురు శ్రీ పృధ్వీశ్వర స్వామి దేవస్థానం ఈవో బీవీ.కోటేశ్వర రావు పర్యవేక్షణలో ఘంటసాల ఐటిఐ కాలేజ్ విద్యార్థులచే 14 నెలలకు సంబందించి దేవస్థానం లోని హుండీ లెక్కించగా రూ.3,46,723 ఆదాయం వచ్చినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, అర్చకులు దాలిపర్తి చలపతిరావు, చావలి కృష్ణ కిషోర్, చావలి దుర్గా దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.





# ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అవనిగడ్డ గ్రామం రెండో వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త సైకం సుబ్రహ్మణ్యం ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అవనిగడ్డ మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సోదరుడు విక్కుర్తి రాంబాబు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు విక్కుర్తి రాంబాబు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి పంచాయతీలో టన్ను వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి చేయాలి

మోతుగూడెంలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఎక్స్‌పోజర్ విజిట్

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.



ఘన వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణతో పాటు వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రతి గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. ఇమ్మానుయేల్ సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన సర్క్యులర్ నెం.1765832/ సి పి ఆర్ అండ్ ఆర్ డి/ ఎస్ డబ్ల్యు ఎం/2026, తేదీ 22-09-2026 మేరకు శుక్రవారం చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పంచాయతీలోని ఎస్ డబ్ల్యు పి సి షెడ్ వద్ద వి.ఆర్.పురం మండలానికి చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు, క్లాప్ మిత్రలతో ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోతుగూడెం ఎస్డబ్ల్యుపిసిలో అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ, తడి వ్యర్థాల సేకరణ, ఎన్ ఏ డి ఈ పి పద్ధతి, వర్మీ బెడ్ల నిర్వహణ, వానపాముల సంరక్షణ వంటి మంచి పద్ధతులను అధికారులు, క్లాప్ మిత్రలకు వివరించారు.



# ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తాం



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు కీలక పాత్ర పోషించాలని, విలువైన ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగా హన కల్పించడంతో పాటు నిష్పక్షపాతంగా తమ విధులను నిర్వర్తించాలని రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ పిలుపునిచ్చారు.మచిలీపట్నం పరిసర ప్రాంత దాగురె ఫోటో ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీగా రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా, శనివారం లంకిశెట్టి కార్యాల యంలో సంఘం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పా ల్గొన్న లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, సంఘంలో నమోదైన ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించే సందర్భాల్లో వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల కోసం ఫోటో భవన్ నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యువ ఫోటోగ్రాఫర్ల నైపుణ్యాభివృద్ధికి స్కిల్ సెంట ర్ల ద్వారా శిక్షణ అందించాలని, వృద్ధాప్యంలో ఉన్న ఫోటోగ్రాఫర్లకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు గురిజాల సుధీర్, కార్యదర్శి వంక అనంత కుమార్, కోశాధికారి బైత సత్యనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు రవి, రాకేష్, తేజ, హరి, కళ్యాణ్, చిన్న, శేషుబాబు తదితరులు పాల్గొని లంకిశెట్టి బాలాజీని సన్మానించారు.



# అధికారుల చర్యలు బేఖాతరు..

**మళ్లీ రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు! గతంలో తొలగించినా మారని తీరు.. జిల్లా కోర్టు సెంటర్‌లో మళ్లీ రోడ్డు స్థలం ఆక్రమణ...**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : మచిలీపట్నం నగర అభివృద్ధి, రహదారులపై ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు చేపట్టిన చర్యలు కొందరిలో మార్పు తీసుకురాలేదు. గతంలో అధికారులు ఎంతో శ్రమించి తొలగించిన ఆక్రమణలు మళ్లీ వెలుస్తున్నాయి నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో గతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. పోలీసుల సహకారంతో నగరపాలక సంస్థ సిబ్బంది యంత్రాల ద్వారా ఆక్రమణలను తొలగించి రహదారులను అందుబాటులోకి తెచ్చారు. అయితే, కొంతకాలం గడిచాక తిరిగి ఆక్రమణలు చోటుచేసుకున్నాయి.మచిలీపట్నం నగరంలోని 10వ డివిజన్ సుకర్లాబాద్ ప్రాంతంలో జిల్లా కోర్టు సెంటర్‌లోని సాయిబాబా గుడి ఎదురుగా రోడ్డు మార్జిన్‌ను ఆనుకుని నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కనిపిస్తోంది. రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో భరంతు మట్టిని నింపి, ఇటుకలతో అంచులు ఏర్పాటు చేసిన దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.




ప్రధాన రహదారుల పక్కన ఉన్న మార్జిన్లు వాహనదారులు, పాదచారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇటువంటి స్థలాల్లో అనధికార నిర్మాణాలు జరిగితే రహదారులు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. నగర అభివృద్ధి కోసం ఒకవైపు ఆక్రమణలను తొలగిస్తూ, మరోవైపు తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.డివిజన్ పరిధిలో రహదారి పక్కన నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**సర్టిఫికెట్లు పోయినవి**

నేను చలవాది లక్ష్మీ సునంద. ఆగిరిపల్లి గ్రామంలోని మా ఇంటి నుంచి నా అసలు బీటెక్ విద్యార్హత సర్టిఫికెట్లను నకళ్లు తీయించేందుకు తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలో బండి మీద నుంచి జారిపడి పోయాయి. అవి ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి 81065 54209 నంబరుకు సమాచారం అందించగలరు.

# సి.ఇ.సి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

## సీఐటీయూ,వ్య.కా, రైతు, కౌలు రైతు సంఘాలు పిలుపు.




ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.
ఎన్నికల ప్రక్రియ, ఎస్.ఐ.ఆర్. లపై తలెత్తిన వివాదాల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సి.ఇ.సి) జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామ చేయాలని, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, రాజ్యాంగ హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ నేడు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు పిలుపు నిచ్చారు.శుక్రవారం ఏలూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయా సంఘాల జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు,డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడారు. జ్ఞానేష్ కుమార్ కేంద్ర ఎన్నికల కమిషనర్ గా కాకుండా బిజెపి ఏజెంట్ గా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్.ఐ.ఆర్. విషయంలోగాని, ఫారమ్ 6, ఫారమ్ 16 విషయాల్లో లో భిన్నభిప్రాయాలను వ్యక్తం చేసినా వాటిని పట్టించుకోకుండా వ్యవహరించారన్నారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన పౌరులకు ఓటు హక్కును కల్పించాల్సింది పోయి దాదాపుగా 13 కోట్ల మంది ఓటు హక్కును తొలగించడం అప్రజాస్వామికమన్నారు. ముగ్గురు ఉండే ఎలక్షన్ కమిటీలో జ్ఞానేష్ కుమార్ అనే ఒక్కరు మిగిలిన ఇద్దరికి ఎటువంటి సమాచారాన్ని అందించకుండా, వారితో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు చేసారనే ఆరోపణలు రావడం,ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ద్వారా ఓట్లు తొలగింపు జరిగిందనే దానికి బలం చేకూరుతోందన్నారు.

భవిష్యత్తు లో ఓటు హక్కు ఉన్న వారికే సంక్షేమ పథకా లు అమలు చేసే ఆలోచనలో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. రాజ్యాంగంలో మనుధ ర్మాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయని, అందులో భాగంగానే జిల్లాలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పంపన రవికుమార్, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తపాలా దినోత్సవం సందర్బంగా సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు
ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు యు కె ఎస్ సి గవర్నర్ పెనుమాక రామ మోహన్ రావు, ముఖ్యఅతిథిగా అధ్యక్షులు డాక్టర్ సంగినిడి వెంకట రంగారావు అధ్యక్షతన తపాలా దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో పాలకొల్లు హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు పోస్టుమాన్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి వాసా కుమారస్వామి, మేడపాటి కరుణానిధి లను మరియు హెడ్ పోస్ట్ మాస్టర్ గాజులపాటి సూర్యనారాయణ ను సత్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ జక్కంపూడి మదన్ మోహన్,క్లబ్ ప్రధానకార్యదర్శి గంధం యేసుపాదం, కోశాధికారి శిరిగినీడి రాంబాబు, ఫౌండర్ పోకల రాము, క్లబ్ సభ్యులు కానూరి ప్రభాకర్, గుండుమొగుల వీరాస్వామి, యర్రంశెట్టి వెంకటరత్నం, కర్రా నరసింహారావు,చేగొండి ప్రభాకర్ లంకలపల్లి ఖగరాజు, కొట్టి భాస్కరరావు, యాతం రమేష్, భీమనాధం సత్యనారాయణ, కూనపరెడ్డి చిన్ని, మండెల ఫణి మరియు హెడ్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.కొట్టి భాస్కరరావు సేకరించిన పోస్ట్ కార్డ్స్, లెటర్స్, స్టాంప్స్ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది.

## ఆచార్య మాడభూషి సంపత్ కుమార్‌కు సాహిత్య ప్రతిభ పురస్కారం

-12న ఏలూరు సాహిత్య మండలిలో శరన్నవరాత్రుల సాహిత్యోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు
రామకృష్ణపురంలోని సాహిత్య మండలి, కె.వి.ఎస్.ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న సాయంత్రం 5.30 గంటలకు శరన్నవరాత్రుల సాహిత్యోత్సవం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త,ఆచార్య డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్‌కు 'కళారత్న డాక్టర్ కె.వి. సత్యనారాయణ సాహిత్య ప్రతిభ పురస్కారం-2026' ప్రదానం చేయనున్నారు.తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన ఆయన 35 పరిశోధనా,సాహిత్య గ్రంథాలను రచించారు.ఆయన పర్యవేక్షణలో 30 మంది పీహెచ్‌డీ, 78 మంది ఎం.ఫిల్.పట్టాలు పొందారు.పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో నూతన భోజనశాల ప్రారంభోత్సవం, స్వాగత నృత్య ప్రదర్శన, సాహితీ ప్రముఖుల సత్కారం నిర్వహించను న్నారు.సాహితీప్రియులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## పాఠశాలలో సరైన పద్ధతిలో భోధన బేస్‌లైన్ పరీక్షల పరిశీలన



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు
పట్టణ పరిధిలోని జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఈరోజు ప్రధమ్ ఆర్గనైజేషన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీ డి. రాజేష్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన బేస్‌లైన్ పరీక్షలకు సంబంధించి శాంపిల్ టెస్ట్ వెరిఫికేషన్ నిర్వహించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులలో విద్యార్థుల అభ్యసన స్థాయిలను అంచనా వేసే ప్రక్రియను పరిశీలించారు.అనంతరం ఈ విద్యా సంవత్సరంలో పరీక్షల నిర్వహణలో వచ్చిన మార్పులను ఉపాధ్యాయులందరికీ వివరించారు. పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన గ్రేడ్లను అసెస్‌మెంట్ బుక్‌లోని టూల్-2లో పరిశీలించి, అందులో గుర్తించిన సవరణలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులకు తెలియజేశారు.విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిలను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించడం ద్వారా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ తో పాటు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, మధుసూదన్, లీలాకుమారి, నందిని పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

-ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్,పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల హక్కులకు నష్టం కలుగు తోందని ఆరోపించారు.ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అనుకూలంగా ఎన్నికల కమిషనర్ పనిచేస్తున్నారని ఆరోపిస్తూ,జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్, ఏఐవైఎఫ్ నాయకుడు కురెళ్ల వరప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు కాకి నాని, ఏఐఎస్ఎఫ్ నాయకులు తొర్లపాటి అంబేద్కర్, వెంకటేష్,సుభాష్, హరీష్, సీపీఐ ఏలూరు నియోజకవర్గ సమితి కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం కోసం

# రెడ్డి అప్పలనాయుడు సంఘీభావం

### న్యాయవాదులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు
న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు విజయవాడ జోన్ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సంఘీభావం తెలిపారు.న్యాయవాదులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ,వివిధ కారణాలతో న్యాయవాదులపై దాడులు జరుగుతూ వారిలో అభద్రతాభావం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరిగే దాడులను ఖండిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో, దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, సమర్థవంతంగా పనిచేయాలంటే న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించే దిశగా ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల సహాయం అందించినట్లు పేర్కొన్నారు. న్యాయవాదులపై భౌతిక దాడులు జరగకుండా, వారి వృత్తిపరమైన భద్రతకు భరోసా కల్పించేలా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని రెడ్డి అప్పలనాయుడు కోరారు.ఈ చట్టం సాధన కోసం బార్ కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలుపుతూ,వారి ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు.

### ఏలూరు బార్ అసోసియేషన్లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు రెడ్డి అప్పలనాయుడు సంఘీభావం.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.
ఏలూరులోని జిల్లా కోర్ట్ ఆవరణలో శుక్రవారం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలనే ప్రధాన డిమాండ్ తో ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 5 రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు.. శుక్రవారం దీక్ష శిబిరం వద్దకు ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు చేరుకుని దీక్ష చేపట్టిన న్యాయవాదులకు జనసేన పార్టీ తరపున సంఘీభావం తెలిపారు.. న్యాయవాదులను బెదిరించిన, గాయపరిచిన, వారి ఆస్తులకు నష్టం కలిగించిన, నిందితులకు కఠినమైన శిక్షలు పడేలా చట్టపరమైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.. వాద ప్రతి వాదనల సమయంలో తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు న్యాయవాదులు పడే శ్రమ ఎంతో గొప్పదన్నారు.. కూటమి ప్రభుత్వంలో, రానున్న రోజుల్లో, న్యాయవాదులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని ఆయన అన్నారు.. అనంతరం న్యాయవాదులు రెడ్డి అప్పలనాయుడుని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామారావు, వైస్ ప్రెసిడెంట్ ఎన్ కృష్ణారావు, జనరల్ సెక్రటరీ నిమ్మల జ్యోతి కుమార్, జాయింట్ సెక్రటరీ ఇబ్రహీం షరీఫ్, జిల్లా పబ్లిక్ పాసిక్యూటర్ ఏవి నారాయణ, పిడి ప్రసాద్, ఏలూరు వెంకటేశ్వరరావు, తెల్ల కన్నారావు, వీరబత్తిన సాయి రమేష్, వీర సురేష్, కొఠారి కృష్ణ కిషోర్, విజయానంద్, సత్యనారాయణ, వెంకట్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ, క్షీరా రామం దేవస్థానాల్లో దేవి నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు పూర్తి



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు
పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం లో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా ర రామలింగేశ్వర స్వామి దేవస్థానం , ఎడ్ల బజార్, ఉలంపర్రు, ప్రాంతాలలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానాలలోనూ, పాలకొల్లు పెద్దింట్లమ్మ అమ్మవారు, దేశాల అమ్మవారు, పంతల ముసలమ్మల అమ్మవార్ల ఆలయాలలో దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశాయి. ఈనెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 11 హైమావతి ఈశ్వరి దేవి అలంకరణ, 12న గాయత్రీ దేవి, 13న అన్నపూర్ణాదేవి, 14న మహాలక్ష్మీదేవి, 15న లలితా త్రిపుర సుందరి దేవి, 16న సరస్వతి దేవి, 17న శాంకరీ దేవి, 18 శ్రీ కాళికాదేవి, 19న మహిషాసుర మర్దిని దేవి, 20న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ కోరింది.

# ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

### ట్రై కార్ చైర్మన్ బొరగం గ్రీవెన్స్..



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం
ప్రాధాన్యత క్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని,రాజకీయంలో పదవుల కన్నా ప్రజా సేవలోనే పరమార్ధం ఉంటుందని పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బుసరాజుపల్లిలో గల నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక “గ్రీవెన్స్” (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు, మహిళలు, రైతులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన బొరగం వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ “కూటమి ప్రభుత్వంలో ప్రతిసమస్యకు పరిష్కారంతో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పోలవరం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# చుట్టుగుంటలో 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం

- రూ.25 లక్షలతో త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం..
- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు
పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామ పంచాయతీ పరిధిలోని చుట్టుగుంట గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 24 గంటల నిరంతర త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం గ్రామంలో కాలినడకన పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.నిలిచిపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులను 15 నుంచి 20 రోజుల్లో ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, పాలు, పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు.కేంద్రంలో మౌలిక వసతులు మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ అంబేద్కర్,మండల పార్టీ అధ్యక్షుడు ఈడుపుగంటి అనిల్,చింతమనేని చిన్న గోపి,చింతమనేని సతీష్, అధికారులు,కూటమి నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి
త్వరలో నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ విధానాలు, ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రూట్ మ్యాపులు, జోన్ల విభజన తదితర అంశాలపై అబ్దుల్ సలాం సవివరంగా వివరించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యదర్శులు అవసరమైన అవగాహనతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దుర్గారావు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## నాలుగోవ రోజుకు చేరుకున్న వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల శాంతియుత నిరసన



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం
ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్వర్యంలో మండలంలోని కోట రామచంద్రపురం, ఐ.టి.డి.ఏ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాలు నాలుగోవ రోజుకు చేరుకున్నాయి. ఈ నిరసన కార్యక్రమంలో శుక్రవారం గిరిజన ప్రాంతంలోని సుమారు 100 మంది అన్ని క్యాడర్ ల ఉద్యోగులు విధులు బహిష్కరించి, ఒంటి కాళ్లతో నిలబడి శాంతియుత నిరసన ప్రకటించారు.తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం కోసం శాంతియుత నిరసన చేస్తుంటే ప్రభుత్వం మాత్రం తమకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని, సోకాజ్ నోటీసులు, టర్మినేషన్ ఆర్డర్స్ లాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేసే వరకు, డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని, జేఏసీ, ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సర్వీసును తక్షణమే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సేవలు క్రమబద్ధీకరించే వరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 100% గ్రాస్ శాలరీ చెల్లించి ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ అధ్వర్యంలో పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి బన్నే వినోద కుమార్, ఐఎఫ్టియు ఏలూరు జిల్లా అధ్యక్షుడు కెవి రమణ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మొడియం నాగమణి, మండల కన్వీనర్ టి.రామలక్ష్మి పుష్ప, తదితరులు తమ సంఘీభావాన్ని తెలిపారు.

# 1950 తర్వాత ఇదే.. చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్ నినో

ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

డిసెంబరు నాటికి పరాకాష్టకు తీవ్రత! దీని ప్రభావంతో భూగోళంపై అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే గణనీయంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. రాబోయే డిసెంబరు నాటికి ఎల్ నినో తన గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ అసాధారణ వాతావరణ పోకడ కొనసాగడానికి నూటికి నూరు శాతం అవకాశాలున్నాయని సంస్థ స్పష్టం చేసింది. 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్ నినో.డబ్ల్యూఎంవో తాజా నివేదిక ప్రకారం, 1950 సంవత్సరం తర్వాత నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఇది ఒకటిగా నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉంది. మానవ తప్పిదాలు, కాలుష్యం కారణంగా ఇప్పటికే పెరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఎల్ నినో మరింత తీవ్రతరం చేస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్టోబరు నుంచి



డిసెంబరు మధ్య కాలంలో ఎల్ నినోకు కేంద్ర బిందువుగా భావించే మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోనున్నాయి. అక్కడ సాధారణ ఉష్ణోగ్రతల కన్నా సుమారు 2.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేశారు.'ఎర్రబారిన' భూగోళం.. పసిఫిక్ నుంచి ఉష్ణ విడుదల .ఈ అనూహ్య వాతావరణ మార్పులపై అంతర్జాతీయ వాతావరణ నిపుణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో అపారంగా నిక్షిప్తమై ఉన్న వేడి క్రమంగా బయటకు విడుదలవుతోందని, దీని పర్యవసానంగా భూమిపై అనేక ప్రాంతాలు అసాధారణ వేడిగాలులు, తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతాయని శాస్త్రవేత్తలు వివరించారు. భూగోళం ప్రస్తుతం దాదాపు 'ఎర్రగా' మారిపోయిందని, రాబోయే శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్ నినో దూసుకుపోతోందని ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మౌవీ విశ్లేషించారు. ఈ వాతావరణ పోకడ గతంలో ఎన్నడూ చూడని సరికొత్త భౌగోళిక ప్రాంతాలకూ విస్తరిస్తోందని జిక్ హౌస్‌ఫాదర్ పేర్కొన్నారు.

**సూపర్ సూపర్ ఎల్ నినో ముప్పు.. భారత్‌పై ప్రభావం**

పసిఫిక్‌లోని 'నినో 3.4' అనే కీలక ప్రాంతంలో ఉష్ణోగ్రతల వ్యత్యాసాలు సాధారణం కన్నా 3.4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయని, గత చరిత్రలో ఏ ఎల్ నినో సమయంలోనూ ఇంతటి తీవ్ర పరిస్థితి తలెత్తలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ తీవ్రతను గమనించిన వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ దీనిని 'సూపర్ సూపర్ ఎల్ నినో'గా అభివర్ణించారు. ఈ పరిణామం ఇప్పటికే భారత రుతుపవనాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో దేశంలో దీర్ఘకాల సగటు వర్షపాతంతో పోలిస్తే కేవలం 87.4 శాతం మాత్రమే వర్షాలు కురిశాయి.ఎల్ నినో మరింత బలపడుతుండటంతో రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, పర్యావరణ వ్యవస్థలపై పెను ప్రభావం పడే ప్రమాదం ఉంది. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే తీవ్ర కరవు పరిస్థితులు, అకాల వేడి, జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోవడం వంటి సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనివల్ల ఆహార భద్రతతో పాటు ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ఒత్తిడి నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

## నిర్వాహక్ దళ్ సభ్యుడిగా ముత్యాల కామేష్



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

జనసేన పార్టీ ఏలూరు పార్లమెంటు నిర్వహక్ దళ్ సభ్యులుగా నూజివీడు జనసేన పార్టీ నాయకులు ముత్యాల వెంకట కామేశ్వరరావు (కామేష్)ని జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ నియమించడం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు , నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం , కమిటీలను నియమకంలో కీలక పాత్ర వహించనుంది..

## సిమెంట్ వ్యాను ఢీకొని భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామంలోని రావిచెర్ల అడ్డరోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సగ్గూరు గ్రామానికి చెందిన కడియాల శేషగిరిరావు, ఆయన భార్య మణి తీవ్రంగా గాయపడ్డారు. నూజివీడు నుంచి స్వగ్రామానికి వెళ్తున్న వారు రోడ్డు దాటుతున్న సమయంలో ఆగిరిపల్లి వైపు వెళ్తున్న సిమెంట్ వ్యాను ఢీకొన్నట్లు సమాచారం. ఈ ఘటనలో శేషగిరిరావుకు తలకు తీవ్ర గాయం కాగా, మణికి రెండు కాళ్లు విరిగినట్లు తెలిసింది. స్థానికులు, పోలీసులు స్పందించి క్షతగాత్రులను విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు..

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆసుపత్రుల్లో ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు డాక్టర్ టీనా, డాక్టర్ మహిత, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యాప్రియ వివరించారు. గర్భధారణ సమయంలో క్రమం



తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కార్డు ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రసూతి సేవలను వినియోగించుకోవాలని, ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగేలా ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం 104, 102, 108 వాహన సేవలను ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, వారి బంధువులు, ఆశా కార్యకర్తలు, సహాయక నర్సు మంత్రసానులు, ఆసుపత్రి సిబ్బంది, మధ్యస్థ స్థాయి ఆరోగ్య ప్రదాతలు పాల్గొన్నారు.

## ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

సేవా సంకల్ప అభియాన్ 2026 "లో భాగంగా ఏ రోజు తో దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ జీ ప్రజాసేవ చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సేవా జ్యోతి యాత్ర రాష్ట్ర బీజేపీ పిలుపు అనుసరించి ఈ రోజు ఉదయం ఏలూరు జిల్లా కార్యాలయం లో జిల్లాలో నీ అన్ని మండలం నుంచి పెద్ద ఎత్తున మండల అధ్యక్షుల ల నాయకత్వ లో కిసాన్ మోర్చా మహిళా మోర్చా, ఓ బి సి మోర్చా మరియు యువ మోర్చా ల వారు మోటార్ బైక్స్ వేసుకుని ర్యాలీ గా సేవా జ్యోతి రథం



తో పాటు జిల్లా కార్యాలయం నుండి ఏలూరు టౌన్ లో యాత్ర చేసిన తరువాత తిరిగి జిల్లా కార్యాలయం వద్దగా ముగించారు. మొదట గౌరవ ప్రధాని నరేంద్ర మోడీగారు మరియు నేషనల్ పార్టీ అధ్యక్షుల వారి ఉపన్యాసం అనంతరం స్థానిక కూటమి నాయకులు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీ చిగురుపాటి కుమార స్వామి ఏలూరు శాసన సభ్యులు బడేటి చంటి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జిల్లా బీజేపీ ఇంచార్జ్ కారెంకి శ్రీనివాస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ప్రసంగాలు విని సేవా జ్యోతి ర్యాలీ నిర్వహించి నాము. ఈ కార్యక్రమం లో మన నూజివీడు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## ఎస్ జీ ఎఫ్ బాస్కెట్‌బాల్ జిల్లా సెలక్షన్స్

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 మరియు అండర్ 17 ఇయర్స్ బాల బాలికల ఎంపికలు. శుక్రవారం బెతస్థా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నూజివీడులో, నూజివీడు ఉపవిద్యాశాఖాధికారి డాక్టర్ పి యస్ సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిస్ స్కూల్ కరస్పాండెశీట్ బండి శ్యామ్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ గౌసాని పాల్గొన్నారు. ఉపవిద్యాశాఖాదికారి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యము ప్రదర్శించాలని కోరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నలుమాలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచ



యము చేసుకొన్నారు.బిస్ స్కూల్ కరస్పాండెశీట్ బండి శ్యామ్ మాట్లాడుతూ మాస్కూల్ లో అవకాశం కల్పించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతమంది క్రీడాకారులు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. క్రీడాకారులకు మాస్కూల్ తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.స్కూల్ గేమ్స్ సెక్రటరీ గౌసాని మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహ పూర్వకముగా మెలగాలని కోరారు. గెలుపు, ఓటమిలు సహజమని తెలిపారు. సెలెక్ట్ కాని క్రీడాకారులు నిరుత్సాహ పడవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యాయామఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మి, వనజ, సతీష్, బాజి, వాసు, బలరామ్, రవీంద్ర, ఆలీఖాన్, రాణి, రాజేంద్రప్రసాద్, పుల్లారావు, సుహా ర్లత, హేమ,మణి రత్నం,ఆకాష్, విశ్రాంత వ్యాయామ ఉపాద్యాయులు శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది

### రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొంత మేరకు బాధాకరమైనప్పటికీ తెలుగుదేశంపార్టీ బీసీలకు 34శాతం రిజర్వేషన్ పై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. తెలుగుదేశంపార్టీ మొదటి నుండీ బలహీన వర్గాల అభ్యున్నతి, రాజకీయ సాధికారత, సామాజిక అభివృద్ధి కోసం పనిచేస్తోంది. ఏపీలో తొలిసారి బీసీలను గుర్తించి వారికి రాజకీయంగా 1987లో 20శాతం, 1994లో చంద్రబాబుగారు 34శాతం ఇచ్చి ప్రోత్సహించారు. గొడ్డలిపార్టీ బీసీలకు అన్యాయం చేయడం, వారి హక్కులను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. వై సీ పీ హయాంలో ఏపీ హైకోర్టులో బీసీలకు 34శాతం రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జడ్జిమెంటు వచ్చిన సందర్భంలో కనీసం సుప్రీంకోర్టుకు అప్పీలుకు కూడా వెళ్లకుండా 24శాతానికి బీసీలను పరిమితం చేశారు.అవినీతి కేసులు, మద్యం కేసుల్లో వారి నాయకులు కోసం తాడేపల్లి ప్యాలెస్ నాయకులు, గొడ్డలిపార్టీ నాయకులు అన్ని కోర్టుల్లోనూ బెయిల్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు, కానీ బీసీలకు ఉపయోగపడే అంశాలపై ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లలేదో



బీసీలకు సమాధానం చెప్పాలి. బీసీల సంక్షేమమే తెలుగుదేశంపార్టీ లక్ష్యం అయితే, బీసీల పతనమే గొడ్డలిపార్టీ లక్ష్యం.టీడీపీ డెడికేటెడ్ కమిషన్ ను నియమించి, సుప్రీంకోర్టు సూచనల ప్రకారం పనిచేసి, రిపోర్టు తయారు చేసింది. వైసీపీ పాలనలో డెడికేటెడ్ కమిషన్ ను ఎందుకు నియమించలేదు, బీసీల రిజర్వేషన్ పెంచే అంశంపై శ్రద్ధ ఎందుకు పెట్టలేదు, నా బీసీలు అని చెప్పే గొడ్డలిపార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే భావిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం, సీఎం చంద్రబాబు జీఓల ద్వారా బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే, గొడ్డలిపార్టీ నాయకులు హైకోర్టులో కేసులు ఎందుకు వేశారు.బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం, వారి సామాజిక అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34శాతం సీట్లు కేటాయించి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని కల్పిస్తాం.

## అబ్బిరాజుపాలెం లో ఉపాధి హామీ శ్రామికుల ఆటలు పోటీలు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ శ్రామికుల శ్రమకు గౌరవంగా యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆత్మీయ భోజనాల కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా శ్రామికులకు వివిధ ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లక్కీ డ్రిప్ లో విజేతలకు చీరల అందజేశా



రు. శ్రామికులందరికీ భోజనాలు ఏర్పాటు చేయడంతో అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలవల వీర మహేష్, చింత కృష్ణ భగవాన్, చేగొండి సత్యనారాయణ, వలవల శ్రీరామమూర్తి, అంబటి విజయ్, తోలేటి చంటి, వలవల ఆంజనేయులు, మామిడి శెట్టి పెద్దిరాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, ఆరిమిల్లి చిన్ని, మాత రత్నరాజు, వలవల బాబి, కడల్ గోపాలరావు, తాళ్ల నాగరాజు, తల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

### తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ..

### విక్రయాల ద్వారా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాల చెల్లింపు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచి, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఆగిరిపల్లి మండలంలోని అన్ని గ్రామాల గ్రీన్ అంబాసిడర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా డీపీఆర్‌పీ విభాగానికి చెందిన శ్యామలరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. సేకరించిన తడి చెత్తను ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించి, అక్కడ నెల రోజుల పాటు నిల్వ ఉంచి, వానపాముల సహాయంతో వర్మీ కంపోస్టు ఎరువుగా తయారు చేయాలని వివరించారు. ఈ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రీన్ అంబాసిడర్ల వేతనాల చెల్లింపునకు వినియోగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఉప ఎంపీడీవో దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా మెగా వైద్య శిబిరం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా సర్వజనాసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి హాజరై వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు.వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సేవలను ప్రశంసించారు.రానున్న డిసెంబర్ నాటికి జిల్లా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి వైద్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

త్వరలో నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ విధానాలు, ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, రూట్ మ్యాపులు, జోన్ల విభజన తదితర అంశాలపై అబ్దుల్ సలాం సవివరంగా వివరించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యదర్శులు అవసరమైన అవగాహనతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దుర్గారావు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభూ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం నుంచి 20వ తేదీ మంగళవారం వరకు దేవి శరన్నవరాత్రి మహో త్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చీమలకొండ సాయి తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు సహస్రనామార్చన, 10 గంటల నుంచి చండీ హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి, సోమవారం శ్రీ గాయత్రీదేవి, మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి, బుధవారం శ్రీ మహాచం డీదేవి, గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, శుక్రవారం శ్రీ సరస్వతీదేవి, శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి, ఆదివారం శ్రీ దుర్గాదేవి, సోమవారం శ్రీ మహిషాసురమర్దినీదేవి, మంగళవారం శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు వివరించారు. విజయదశమి సందర్భంగా ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నసం తర్పణ, సాయంత్రం 6 గంటలకు ఆగిరిపల్లి గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కోరారు.

## దాతల సహకారంతో పాఠశాలకు బీరువా, ముద్రణ యంత్రం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



వట్టిగుడిపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయురాలు ఇందిర, నాగభూషణరావు దంపతులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.20 వేల విలువైన బీరువాను, గ్రామ పెద్ద ఎన్. కామేశ్వరరావు రూ.20 వేల విలువైన ముద్రణ యంత్రాన్ని అందజే శారు. వీటిని మండల విద్యాశాఖ అధికారులు మాదాసి సత్యనారాయణ, కొవ్వలి ఆనంద్ కుమా ర్ ప్రారంభించారు. దాతల సహకారం అభినందనీయమని, విద్యార్థుల అభ్యున్నతికి ఇవి దోహద పడతాయని ప్రధానోపాధ్యాయురాలు జి. వేదప్రభ పేర్కొన్నారు. అనంతరం దాతలను, అధికారులను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ భూలక్ష్మి ధనలక్ష్మి , గ్రామస్తులు సత్కరించారు.

## బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనూ బీసీలకు అండగా నిలుస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు**

**ఎపి నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యం. ఆదినారాయణ**



ప్రజా భూమి శింగనమల

బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్.యం. ఆదినారాయణ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనూ, బీసీలకు పార్టీ పరంగా 34 శాతం సీట్లు కేటాయించి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల రాజకీయ అభ్యున్నతికి విశేష ప్రాధాన్యత ఇచ్చిందని, బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని ఆదినారాయణ తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా తీసుకున్న చర్యలకు, రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు స్థానిక సంస్

## బహుజన నాయక్ మాన్యవర్ కాన్షీరాం 20వ వర్ధంతి మహాపరినిర్వాణ దినోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలో ప్రెస్ క్లబ్ నందు నిర్వహించిన సభలో బిఎస్పీ నాయకులు, అనంతపురం జిల్లా కార్యవర్గ సభ్యులు, న్యాయవాది పి.ఎస్.హరి ప్రసాద్ ప్రసంగించడం జరిగింది. అనంతపురం ప్రెస్ క్లబ్‌లో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బహుజన నాయక్ మాన్యవర్ కాన్షీరాం 20వ వర్ధంతి మహాపరినిర్వాణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో బిఎస్పీ అనంతపురం జిల్లా కార్యవర్గ సభ్యులు, న్యాయవాది పి.ఎస్.హరి ప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాన్యవర్ కాన్షీరాం కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదని, ఆయన బహుజన సమాజం యొక్క ఆత్మ, ఆశ, ఆకాంక్ష అని అన్నారు. 1934లో పంజాబ్‌లో జన్మించిన కాన్షీరాం ఉద్యోగం వదిలి, వివాహం, ఆస్తి, కుటుంబం అన్నింటినీ త్యాగం చేసి బహుజనుల కోసం తన జీవితాన్ని అర్పించారని గుర్తు చేశారు. సంస్థల ద్వారా ఉద్యమాన్ని నిర్మించి, 1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతినాడు బహుజన సమాజ్ పార్టీని స్థాపించి "ఓటు హమారా, రాజ్ తుమ్హారా, నహీం చలేగా" అనే నినాదంతో బహుజనులను రాజకీయంగా జాగృతం చేశారని తెలిపారు. సైకిల్‌పై వేల కిలోమీటర్లు ప్రయాణించి గ్రామ గ్రామాల్లో బహుజన చైతన్యం నింపిన ఆయన వీరోచిత కృషిని వివరించారు. "15 శాతం వారు 85 శాతం వారిని పాలించడం ఇక సరిపోదు. బహుజనులు ఐక్యమై అధికారం చేపట్టాలి" అనే కాన్షీరాం సందేశాన్ని శుక్రవారం మనం మరోసారి గుర్తు చేసుకోవాలని, ఆయన కలను నెరవేర్చడమే మన కర్తవ్యమని హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందనూరు నాగరాజు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శులు గద్దల నాగభూషణం, అంపావతిని గోవిందు, జిల్లా అధ్యక్షులు లాజర్, ఓబయ్యా, రామలింగం, వినయ్ కుమార్, శ్రీనివాసరాజు, అంకె కుళ్లాయప్ప, జిలాన్ భాష, నాగమ్మ, నాగరత్నమ్మ, గవ్వల ఓబులేసు, మౌలాలి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, ఇందీవర్ మీరియు బిఎస్పీ కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాన్యవర్ కాన్షీరాంకి నివాళులు అర్పించారు. జై భీమ్...జై భారత్...జై బిఎస్పీ!

## యువతను పక్కదారి పట్టించే ఆందోళనలు నాయకులు మానుకోవాలి

**-బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికుర్తి హరి**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

సర్ (ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ) గురించి కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనలు రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడానికి రాజకీయ పబ్బం గడుపుకోవడానికేనని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికుర్తి హరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతను పక్కదారి పట్టించేందుకు ఇండియా కూటమి ఈ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి భారతదేశ రాజ్యాంగ బద్ధ సంస్థలపై బురద చల్లడానికి, బాంగ్లాదేశ్ పౌరులకు కూడా భారత్ లో ఓటు హక్కు కల్పించడానికి డిమాండ్ చేయడం ఫాస్ట్ డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పుడు ఆలోచనలతో సర్ మంటలపై చలి కాచుకోవడమే ఈ ఆందోళనల ముఖ్య ఉద్దేశ్యంగా కనబడుతుందని చెప్పారు. రాజ్యాంగ బద్ధ సంస్థలను రాజకీయాల్లోకి లాగుతాం, దేశాన్ని అస్థిర పరుస్తాం, రాహుల్ గాంధీ అవ్వ ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కినట్లుగా ప్రస్తుతం ఓటు చోరీ పేరుతో రాహుల్ గాంధీ భారత ఎన్నికల కమిషన్ ను రాజకీయాల్లోకి లాగి రాజ్యాంగాన్ని రాజ్యాంగ బద్ధ సంస్థలను తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి చేస్తున్న ఆందోళనలు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సర్ ప్రక్రియ లో చనిపోయిన, రెండు, మూడు చోట్ల ఓట్లు ఉన్న, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారి ఓట్లను తొలగించి ఓటరు జాబితాను తయారు చేస్తున్న ప్రక్రియ మాత్రమేనని చెప్పారు. ఇందులో భారతీయ జనతా పార్టీ కొత్తగా చేస్తున్నది ఏమీ లేదన్నారు. సర్ జవహర్ లాల్ ప్రధానిగా ఉన్నప్పుడు 3 సార్లు (1952, 1957, 1961), లాల్ బహదూర్ శాస్త్రి / ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 2 సార్లు , రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఒక సారి, పి.వి. నరసింహా రావు ప్రధానిగా ఉన్నప్పుడు ఒక సారి, అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఒకసారి నిర్వహించరని, మరి ఇది ఏదో భారత రాజ్యాంగాన్ని, ఎన్నికల వ్యవస్థను చేతిలోకి తీసుకొని, దుర్వినియోగ పరుస్తున్నట్లు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేసి యువతను ప్రక్కదోవ పట్టిస్తున్నారని హరి విమర్శించారు. ఓటు చోరీ విషయానికి వస్తే, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఓట్లను చోరీ చేసి జవహర్ లాల్ ప్రధాని అయ్యారని, రాహుల్ గాంధీ అమ్మ ఏడి విగే ఆంటోనియా అల్బీన మైనో (సోనియా గాంధీ) భారత దేశ పౌరసత్వం పొందడానికి ముందే 1980లో ఓటు నమోదు చేసుకొని ఓటు చోరీ చేశారని, మరి అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని గుర్తు చేశారు. సర్ ప్రక్రియను ప్రభుత్వ అధికారులు (బి ఎల్ ఓ) ,రాజకీయ పార్టీల బూత్ లెవెల్ అధికారులు కలిసి నిర్వహిస్తారని, దొంగే దొంగ అన్నట్లు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ప్రత్యేక ఓటర్ సవరణ ప్రక్రియ నడుస్తోందని, ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు చోరికి పాల్పడుతోందా అని ప్రశ్నించారు. అభివృద్ధి వైపు దూసుకెళ్తున్న భారత దేశానికి యువతను తప్పుదారి పట్టించే ఆందోళనలు కాదనిల ప్రతిపక్ష నాయకునిగా దేశ అభివృద్ధికి అవసరమైన సూచనలు, యువతను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడానికి ఆలోచనలు చేయాలని హితవు పలికారు.

## న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిందే...

**-రిలే దీక్షలకు మద్దతు తెలిపిన రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాలు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

న్యాయవాదుల భద్రత కోసం పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిందేనని మహిళా న్యాయవాదులు, రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. హిందూపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే దీక్షలో భాగంగా శుక్రవారం మహిళా న్యాయవాదులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైకాపా మహిళా విభాగం నాయకురాలు నాగమణి ఆధ్వర్యంలో దీక్షలకు మద్దతు తెలిపారు. దీనికి తోడు ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, బాబావలి దీక్షలో పాల్గొని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాది రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదులథ పరిరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు స్వేచ్ఛగా తమ వాదనలు వినిపించుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు భూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వారికి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు న్యాయవాదుల్యా పరిరక్షణ చట్టం ఎంతో దోహదపడుతుందన్నారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ న్యాయవాదులకు రక్షణ కల్పించే చట్టాన్ని రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయడం వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక కేసును వాదించేందుకు కూడా న్యాయవాదులు భయభ్రాంతులకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమన్నారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు జరిగినప్పుడు వారికి తగిన చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం అవసరమన్నారు. న్యాయవాదులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ వాదనలు వినిపించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. ప్రజలకు న్యాయం అందించే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని, వారి భద్రతను కాపాడటం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల చొప్పున పారితోషికం అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో అందుతున్న రూ.5 వేల కూడా ఇవ్వడం లేదని, వెంటనే బకాయిలతో పాటు ప్రతినెలా జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు అందించాలని కోరారు. కాగా న్యాయవాదుల సమస్యలను, న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు తదితర అంశాలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి తద్వారా ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తారని టిడిపి న్యాయవిభాగం నాయకులు శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు సంతోషి కుమారి, రత్నమ్మ, కళ్యాణి, నవీన్ తాజ్, అంజనమ్మ, దివ్య, పవిత్ర, ఆశ, శ్రీలేఖ, నిహారిక, రసూల్ బీ, వెన్నెల, భాగ్య, యశస్విని, న్యాయవాదులు రాజశేఖర్, సిద్ధు, ఇందాద్, వన్నేరువప్ప, కదిరిష్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం

**-చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి - డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీకాంతి**




ప్రజాభూమి, హిందూపురం టౌన్

సమాజంలోని ప్రజలందరికీ మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని తద్వారా ప్రశాంత జీవనం చేయవచ్చుని జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆఫ్తాబ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, మానసికంగా ఆరోగ్యంగా లేకపోతే ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా మానసిక సమస్యలపై వైద్యులను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలే తప్ప మూఢనమ్మకాల జోలికి వెళ్ళరాదన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జీవన, జతినశ్విన్ మాట్లాడుతూ, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక రోగులకు మెరుగైన చికిత్సలు అందించే నిమిత్తం ప్రత్యేకమైన వార్డు అందుబాటులో ఉందన్నారు. దీనికి తోడు మానసిక వికలాంగులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఔషధాలు కూడా ఉన్నట్లు తెలిపారు. మానసికంగా వైకల్యం మెదడుకు సంబంధించిన రోగమని, మెదడు సక్రమంగా ఎదగని కారణంగా మానసికంగా వివిధ రకాల బలహీనతలు ఉంటాయని తెలిపారు. మానసిక వికలాంగుల నిరుత్సాహానికి గురి చేయకుండా సకాలంలో వైద్య చికిత్సలు చేయించడం ద్వారా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు లోను కావడం, డ్రగ్స్ , గంజాయి గంజాయి వంటి వాటికి బానిసలు కావడం వల్ల కూడా మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ, మానసిక వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలన్నారు. మానసిక వికలాంగుల ఆరోగ్యం మెరుగుపడేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య విధానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, న్యాయవాదులు జగదీష్, అశోక్, ఆశ, యశస్విని, పారా లీగల్ వాలంటీర్ సురేష్, లోక్ అదాలత్ సిబ్బంది రాజా పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు.. మాపై ఎందుకింత కక్ష?

**కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు, నర్సుల సూటి ప్రశ్న - 4వ రోజు కొనసాగిన కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల సమ్మె**

**న్యాయమైన హక్కుల కోసం పోరాడితే షోకాజ్ నోటీసులా..?**






ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు జేఏసీ ఛైర్మన్ శరత్, కో ఛైర్మన్ వెంకట్ కి కూడా షోకాజ్ నోటీసులు అయినా వెనక్కు తగ్గమన్న కాంట్రాక్టు ఉద్యోగులు న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తుంటే షోకాజ్ నోటీసులు ఇస్తారా... సీఎం చంద్రబాబు మాపై ఎందుకింత కక్ష అని కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 4వ రోజు కూడా కొనసాగింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోని వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. పూర్తి స్థాయిలో విధులను బహిష్కరించి పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు పలువురు నర్సులు మాట్లాడుతూ సీఎం సర్.. మేము మీకు ఎప్పటి నుంచో మీకు సపోర్ట్ చేస్తూ వస్తున్నామన్నారు. అయినా మీకెందుకు నర్సులు అంటే అంత కక్ష? అని సూటిగా ప్రశ్నించారు. 16 ఏళ్ల నుండి 20 ఏళ్లుగా తాము ఆసుపత్రులలో రాత్రింబగళ్లు వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. ఇంత కాలం శ్రమిస్తున్నా తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం, కుటుంబాల మనుగడ కోసం శాంతియుతంగా పోరాడుతుంటే, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు జేఏసీ ఛైర్మన్ శరత్, కో ఛైర్మన్ వెంకట్, పలు పీహెచ్‌సీలలోని స్టాఫ్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై నర్సులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులకు తాము భయపడే ప్రసక్తే లేదని, బెదిరింపులతో ఉద్యమాన్ని అణచలేరని స్పష్టం చేశారు. తక్షణమే నోటీసులను ఉపసంహరించుకుని, రెగ్యులరైజేషన్ మరియు వంద శాతం పూర్తి వేతనం వంటి డిమాండ్లపై ప్రభుత్వం జీఓలు విడుదల చేసే వరకు వెనక్కి తగ్గేదే లేదని భీష్మించుకు కూర్చున్నారు. అక్టోబర్ 3 డెడ్‌లైన్ ముగిసినా కాలయాపన చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, రోగుల కష్టాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో రెగ్యులర్ యూనియన్ నాయకులు ఆర్.బి పద్మ, లత, సంధ్యా, అరుణ, సిఐటియు నాయకులు ఆర్.వి నాయుడు, నాగేంద్ర. కుళ్లాయప్ప, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, డిస్కవరీ ఛానల్ అనిల్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

## ఓట్ల తొలగింపుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**-ఎన్నికల సంఘం ప్రధాన అధికారి రాజీనామా చేయాలి**

**-అక్టోబర్ 10న ఛలో లోక్‌భవన్ నిర్వహిస్తాం**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు 13.3 కోట్ల ఓట్లను తొలగించడం దారుణమని విమర్శించారు. ఈ చర్య పేదలు, విద్యార్థులు, వలస కార్మికుల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాలరాయడమేనని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ఓట్ల దొంగగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణకు ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనలో భాగంగా వేలాది మంది విద్యార్థులతో 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు విద్యార్థులు, యువత పెద్దఎత్తున ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాలు ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నిర్వాహకుడు కమల్ భాష, విద్యార్థి సంఘాల నాయకులు బద్రీనాథ్, అనుదీప్, దేవా, నాగేంద్ర, సునీల్, రవీంద్ర, అభి, లక్ష్మీనారాయణ, కృష్ణ, నవీన్, మోహన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని చలివెందులలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ చౌడమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి హిందూపురం సీనియర్ నాయకుడు కొండూరు వేణుగోపాల్ రెడ్డి రూ.లక్ష విరాళం శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్మాణాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆయన ఈ విరాళాన్ని అందించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తున్న ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు, ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని కొండూరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సహకారంతో ఆలయ నిర్మాణ పనులు మరింత ముందుకు సాగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈడిగ నరేష్ గౌడ్, నేసే గంగాధరప్ప, నేసే కిష్టప్ప, నేసే నరసింహప్ప, ఎన్. రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - స్మార్ట్ కిచెన్ పనితీరును ప్రశంసించిన టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని సకాలంలో అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని స్మార్ట్ కిచెన్‌లో తయారు చేసిన భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. భోజనం నాణ్యంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బంది పనితీరును ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నారని రామముని రెడ్డి తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం సమర్థంగా అమలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి చొరవతో విద్యార్థులకు సకాలంలో భోజనం అందేలా చర్యలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రభుత్వ పాఠశాలలకు సకాలంలో భోజనం చేరేలా చూడాలని సంబంధిత సిబ్బందికి రామముని రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్టాలిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, ఏపీఎం వెంకటేశ్వరరావు, టీడీపీ టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జి మహమ్మద్, నాయకులు డక్కా రమేష్, జబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

# స్నేహిత అమృత హస్తం భవనానికి మరో రూ.20 వేలు విరాళం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవనానికి ప్రముఖ సీనియర్ న్యాయ వాది కరుణాకర్ రెడ్డి, హేమలత దంపతులు మరో రూ.20 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఈ విరాళాన్ని సేవాసమితి అధ్యక్షుడు రాజుకు అందించారు. గతంలో రూ.30 వేలు విరాళంగా ఇచ్చిన ఈ దంపతులు తాజా విరాళంతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి దంపతు లను సేవాసమితి తరఫున ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ వారి ఔదార్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దాతలు మాట్లాడుతూ విద్య, వైద్యం, నేత్ర సేకరణ, యువత, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ వంటి సేవా కార్యక్రమాలకు ఈ నూతన భవనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సురేష్, రాఘవేంద్రరెడ్డి, రామలక్ష్మణ్ రెడ్డి, డాన్స్ మాస్టర్ రాజా పాల్గొన్నారు.

# పులివెందుల నియోజకవర్గానికి అదనపు శనగ విత్తనాలు కేటాయించాలి

### ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేసిన మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల నియోజకవర్గంలో రబీ సీజన్ కు రైతుల అవసరాలకు ప్రస్తుతం కేటాయించిన శనగ విత్తనాలు సరిపోవడం లేదని, ఏటీఎల్పీ పథకం కింద అదనపు విత్తనాలు కేటాయించాలని పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ఆదేశాల మేరకు పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి శుక్రవారం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం అందజేశారు. రబీ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అదనంగా విత్తనాలు కేటాయించాలని కోరినట్లు ఆయన తెలిపారు. మండలాల వారీగా వేంపల్లి-2000, వేముల- 3000, పులివెందుల - 1500, లింగాల - 1000, సింహాద్రిపురం - 4000, తొండూరు - 3500 క్వింటాళ్లు కేటాయించాలని వినతిలో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ తగిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని వెంకటరామిరెడ్డి తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు కపట నాటకం

### పులివెందుల బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నూరు కార్తీక్



ప్రజాభూమి,పులివెందుల

బీసీల రిజర్వేషన్లపై చంద్రబాబు కపట నాటకం ఆడుతున్నారని పులివెందుల వైకాపా బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నూరు కార్తీక్ విమర్శించారు. శుక్రవారం పులివెందులలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులు తెలిసి కూడా బీసీ ఓట్ల కోసం పబ్లిసిటీ స్టంట్ చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం క్షమించరాని నేరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పేరుతో చంద్రబాబు ఆడిన పొలిటికల్ గేమ్ సుప్రీంకోర్టు తీర్పుతో బట్టబయలైందన్నారు. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలను కలిసినప్పుడు వినతిపత్రం ఇచ్చి రిజర్వేషన్లను షెడ్యూల్ 9 లో చేర్చేలా కృషి చేసి ఉంటే బీసీ సంఘాలు హర్షించేవని అన్నారు. కోర్టు తీర్పుల ఛూచీతో బీసీ ఓట్లను తన వలలో వేసుకోవాలనే ప్రయత్నం మరోసారి బట్టబయలైందని, ఇది బీసీలకు మరో వెన్నుపోటు అని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలే చంద్రబాబుకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# యర్రగుడిపల్లి యూజీడీ సమస్యకు పరిష్కారం

### - చొరవ తీసుకున్న వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని యర్రగుడిపల్లి ప్రాంతంలో గత కొంతకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యకు పరిష్కారం లభించింది. మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవతో శుక్రవారం పనులను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో కాలనీవాసులు ఊరట చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, మున్సిపాలిటీలో నిధులు లేకపోయినా ఎంపీ దృష్టికి తీసుకెళ్లి ఎంపీ నిధులతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్లు కోడి రమణ, పురుషోత్తం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, కృష్ణమూర్తి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ అహోబిలాపురంలో వైకాపా ఇంటింటి ప్రచారం

### పులివెందుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదు - వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పులివెందులలోని అహోబి లాపురంలో వైకాపా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, దేరంగుల చంద్రమౌళి తదితరులు అహోబిలాపురంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. పెండింగ్ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైకాపా బలపరిచిన చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ముందుగా అహోబిలాపురం వైకాపా నాయకులు గండి, ఈశ్వరయ్య, హరి, చిన్న కులాయప్ప, నాగరాజు, అంకాల్ రెడ్డి నాయకులకు ఘన స్వాగతం పలికి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

# దసరా సంబరాల్లో విద్యార్థుల సందడి

### - శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలు

### - కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, స్కిట్లతో సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి



రెడ్డి మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని తెలిపారు. విద్యార్థులు పండుగల విశిష్టతను తెలుసుకోవడంతో పాటు మన సంస్కృతి,



సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ సంప్రదాయ వేషధారణలతో పాటు పలు పాత్రలను ప్రతిబింబించే గెటప్‌లలో ఆకట్టుకున్నారు. వారు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నుంచి ఉన్నత తరగతుల విద్యార్థుల వరకు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులను చక్రపాణి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు అండగా హ్యూమన్ రైట్స్ ఫర్ జస్టిస్ - జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్

### ప్రజల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా పోరాడతాం




ప్రజాభూమి,పులివెందుల,

ప్రజల హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడతామని హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ స్పష్టం చేశారు. జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావు ఆదేశాల మేరకు శుక్రవారం పులివెందులలోని శివసాయి కల్యాణ మండపంలో కడప జిల్లా సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ముని యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్య, వైద్యం వంటి కీలక రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చట్టపరిధిలో స్పందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సభ్యులు రాకేష్, ఆనంద్, పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ షఫీ, వేంపల్లి మండల అధ్యక్షుడు దివాకర్ రెడ్డి, సింహాద్రిపురం మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మునివర్ధన్, వేముల మండల అధ్యక్షుడు గంగాధర యాదవ్, మీడియా కన్వీనర్ విమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు భక్తులు తరలిరావాలి

### - సింగారెడ్డి జయరామి రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని అమ్మవారిశాలలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా కడప జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం జయరామి రెడ్డి కుటుంబ సభ్యులను ఉత్సవాలకు ఆహ్వానించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే దసరా ఉత్సవాలను ఈసారి కూడా ప్రత్యేక ఏర్పాట్లతో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి 'మన ఊరికోసం' సేవా సంస్థ అండ

### - దాతల సహకారంతో నిత్యావసర సరుకులు, నగదు అందజేత



ప్రజాభూమి, సిద్ధవటం: భర్త, కుమారుడిని కోల్పోయి, మరో కుమారుడి అనారోగ్య పరిస్థితుల నడుమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పక్షవాత బాధిత వృద్ధురాలికి మాధవరం-1 గ్రామానికి చెందిన మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. కొత్త మాధవరం గ్రామానికి చెందిన చందా లక్ష్మీదేవి గత కొన్ని సంవత్సరాలుగా పక్షవాతంతో మంచానికే పరిమితమై జీవిస్తున్నారు. ఆమె భర్త, ఒక కుమారుడు మరణించగా, మరో కుమారుడు అనారోగ్యంతోపాటు మానసిక సమస్యల కారణంగా స్థిరమైన ఉపాధి పొందలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, తల్లిని చూసుకుంటున్నారు. ఆ కుటుంబం విద్యుత్ సౌకర్యం లేకుండా, ఇంటికి తలుపులు కూడా లేని దుర్భర పరిస్థితుల్లో జీవిస్తోంది. వృద్ధురాలికి అందుతున్న నెలకు రూ.4,000 పింఛనే ఆ కుటుంబానికి ప్రధాన జీవనాధారం. వారి దీనస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు దాతల సహకారంతో రూ.8,400 విరాళాలు సేకరించి, బాధిత కుటుంబానికి రెండు బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ఖర్చుల నిమిత్తం రూ.1,950 నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, పుత్తా సుధీర్ రాయల్, సామల చెంగయ్య, జానపాటి సుబ్బరాయుడు, యాగల చంద్రకాంత్, చింతగింజల సుధాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# వెలుగుపల్లిలో దెబ్బతిన్న రహదారి.. పట్టించుకోని అధికారులు!



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో కల్వర్టు సమీపాన రహదారి దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత నాలుగు నెలలుగా రహదారి దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే రైతులు, ద్విచక్ర వాహనదారులు రహదారి గుంతల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, పలువురు కిందపడి గాయాలపాలయ్యారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా, దినపత్రికల్లో కథనాలు ప్రచురితమైనా స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరారు. ఈ విషయమై జంగాలపల్లె పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యను వివరణ కోరగా, వెలుగుపల్లిలో దెబ్బతిన్న రహదారి ప్రాంతంలో ఆదివారం మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

# స్మార్ట్ కిచెన్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీ



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండల కేంద్రంలోని స్మార్ట్ కిచెన్ సెంటర్‌ను కడప డీఆర్డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వీణ వెంకటేశ్వర్లు ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వంట చేసే ప్రదేశంతో పాటు కిచెన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 20 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులందరికీ సరిపడా భోజనం అందిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుజాత, స్మార్ట్ కిచెన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారిలో ముళ్ల పొదలతో రైతులకు ఇబ్బందులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో పంట పొలాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిన ముళ్ల పొదలను అధికారులు తక్షణమే తొలగించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యను వివరణ కోరగా, గ్రామంలోని శ్మశానవాటికకు వెళ్లే రహదారితో పాటు రైతుల పంట పొలాలకు వెళ్లే మార్గాల్లో ముళ్ల పొదలను తొలగించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: పసుపులేటి కళ్యాణ్



ప్రజాభూమి, సిద్ధవటం: రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ నిర్వహక్ దళ్ సభ్యుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు పసుపులేటి కళ్యాణ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను అధిష్ఠానం సూచనల మేరకు సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దవటంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. నాయకత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని పసుపులేటి కళ్యాణ్ స్పష్టం చేశారు.

# చౌడేశ్వరి దేవికి విశేష పూజలు

### దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలకు ఆహ్వానం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణములో బ్రాహ్మణ పల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ శ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి దేవస్థానములో అమ్మవారికి శుక్రవారము సందర్భముగా ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి వారు అమ్మవారికి విశేష పంచామృతములు, సుగంధ ద్రవ్యాభి షేకము,కుంకుమార్చన ,రాహుకేతు పూజలు నిర్వహించారు, శుక్రవార ము కావున భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 11 నుండి 20 వరకు జరుగు దశరా శరన్నవరాత్రుల మహోత్సవ ములు సందర్భముగా అమ్మవారికి ప్రతి రోజు ఉదయం అభిషేకములు సాయంత్రము కుంకుమార్చనలు పల్లకి సేవలు నిర్వహిస్తున్నారని ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి,ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అభిషేకము చేయదలచిన భక్తాదులు ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి ని 9550400255 సంప్రదించి మీ పేరు నమోదు చేసుకోగలరు అని తెలిపారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 10 అక్టోబరు 2026

## తిరుపతి జిల్లాలో భారీ కాపర్ వైర్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట

రూ. 1.20 కోట్ల విలువైన 7 టన్నుల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసిన రేణిగుంట పోలీసులు. శ్రీశైలానికి తరలిస్తుండగా కాపర్ వైర్‌ను దొంగిలించి, వెలూరు సమీపంలో భూమిలో పాతి పెట్టినట్టు తెలిపిన నిందితులు. రూ. 1.20 కోట్ల విలువైన 7 టన్నుల కాపర్ వైర్ చోరీ కేసులో తమిళనాడుకు చెందిన ఆర్. రాజా, కె. నవీన్ కుమార్ అరెస్ట్ చేసిన పోలీసులు. బెంగళూరులోని 'వేదాంతా లిమిటెడ్ – స్టార్‌లైట్ కాపర్ కంపెనీ' నుంచి శ్రీశైలానికి లారీలో తరలిస్తుండగా మార్గమధ్యంలో కాపర్ వైర్‌ను అపహరించిన లారీ డ్రైవర్ వినోద్ కుమార్ మరియు నేరస్తులు. దొంగిలించిన సరుకును వెలూరు సమీపంలోని చెరువు వద్ద గుంత తవ్వి కాపర్ వైర్‌ను పాతిపెట్టిన నిందితులు. రేణిగుంట లారీ పార్కింగ్ వద్ద నిందితుల కోసం రెక్కీ నిర్వహించి పట్టుకున్న పోలీసులు; ప్రధాన నిందితుడు వినోద్ కుమార్, దినేష్ పరారీ. కేసును త్వరితగతిన ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన రేణిగుంట డి.ఎస్.పి వై శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ఎస్సై శ్రీనివాసులను, అర్బన్ పోలీసు సిబ్బందిని అభినందించిన తిరుపతిజిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు.

## టీ.బి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లాలో జోష్ టీం శుభారంభం




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

జోష్ (జోష్) టీమ్స్ ప్రాజెక్ట్ జాతీయ ప్రారంభోత్సవం 2026 అక్టోబర్ 8వ తేదీన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ అలాగే ఢిల్లీ ప్రభుత్వ ( ఎన్ సి టి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వర్చువల్ గా వీక్షించారు. అనంతరం జిల్లా జోష్ టీం ఏర్పాటు చేసి వారి యొక్క విధులు మరియు బాధ్యతల గురించి చర్చించారు. తిరుపతి జిల్లాలోని టీబి ముక్త్ పంచాయతీలకు సర్టిఫికెట్ మరియు గాంధీజీ స్టాచ్యులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్, జిల్లా లెప్రసి ఎయిడ్స్ టీ.బి అధికారి డాక్టర్ శైలజ, వారి బృందం, జిల్లా ఎన్సిసిఅధికారులు, జిల్లా పంచాయతీ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నూతన డీఎస్పీ బి. పావని ని ఘనంగా సత్కరించిన బీజేపీ శ్రేణులు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోలా ఆనంద్ సూచనలు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ బీజేపీ నాయకులు శ్రీకాళహస్తి డీఎస్పీ శ్రీమతి పావని ని కళంకారి పట్టు వస్త్రం, దేవస్థాన శేషవస్త్రం, తీర్ధ ప్రసాదాలుతో ఘనంగా సత్కరించి స్వాగతించారు. పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించేందుకు డీఎస్పీ కీ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సహకరిస్తామని బీజేపీ శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, అసెంబ్లీ కో- కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడుకుప్పం హరీష్ రెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు బాగిత్తి వెంకటేష్, తొట్టంబెడు మండల అధ్యక్షులు వేదం కృష్ణయ్య, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కునాటి నాగరాజు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ అమర్నాథ్, సీనియర్ లీడర్ ఈరబోయిన లోకేష్, పట్టణ ప్రధానకార్యదర్శులు కోనేటి అయ్యప్ప, కటికం చంద్ర శేఖర్, పుణ్యం ఢిల్లీ కుమార్ రెడ్డి, పట్టణ యువమోర్చ అధ్యక్షులు భరత్ కుమార్ నాయుడు, ఎస్ సి మోర్చా అధ్యక్షులు గదిపాకుల యతీష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, కనపర్తి రవి తేజ, ఉపాధ్యక్షులు హుకీమ్ సింగ్, సింగమాల కుమార్, హరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పోలేరమ్మ నూతన ఆలయ పునర్నిర్మాణానికి 3లక్షలు విరాళం

### -అందజేసిన టిడిపి పట్టణ అధ్యక్షులు 786 రఫీ

ప్రజా భూమి ప్రతినిధి(నాయుడుపేట).



తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని వెలసి ఉన్న శ్రీ.శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం అందిస్తానని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ ప్రకటించారు. గురువారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలో జరిగిన శ్రీ పోలేరమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు.కుల మతాలకు అతీతంగా శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ గ్రామ దేవత ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపు ఇచ్చారు.హిందూ–ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నాయుడుపేట పట్టణానికి చెందిన ముస్లిం సోదరుడు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు 786 రఫీ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కుల,మతాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని,ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి తమవంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్థానిక పోరులో తగ్గేదే లేదు..!

### -ఏకగ్రీవాలకు నో.. ప్రతి స్థానంలో పోటీ వుండాలి..- బలమైన అభ్యర్థులను బరిలోకి దించండి.. పార్టీ శ్రేణులకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపు







ప్రజా భూమి ప్రతినిధితిరుపతి రూరల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలో పార్టీ అభ్యర్థులు పోటీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. టీడీపీ ఎత్తులు, కుట్రలను ఐక్యంగా తిప్పికొడుతూ విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.తిరుపతి రూరల్ మండలంలోని కుంట్రపాకం, తణపల్లి , కేసీపేట, దుర్గసముద్రం, చిగురువాడ, మల్లంగుంట, రామానుజపల్లి, సి.గొల్లపల్లి, పైడిపల్లి, పాత కాల్వ పంచాయతీలలో శుక్రవారం హర్షిత్‌రెడ్డి పర్యటిస్తూ పార్టీ కేడర్ ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. కుంట్రపాకంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి స్థానిక ఎన్నికల సన్నద్ధత సమావేశాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అన్ని గ్రామ పంచాయతీలలోనూ పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి ఎన్నికల వ్యూహంపై చర్చించారు.

**ఒక్కో స్థానానికి నలుగురు చొప్పున నామినేషన్లు**

స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానానికి బలమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని హర్షిత్‌రెడ్డి సూచించారు. ఒక్కో స్థానానికి నలుగురు చొప్పున నామినేషన్లు వేసేలా సిద్ధం కావాలని, ఆశావహులంతా నామినేషన్లకు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సమకూర్చుకోవాలని కోరారు. ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికలు జరిగేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడదాం**

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నించే అవకాశం ఉందని హర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో భయపెట్టే ప్రయత్నాలను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నుదన్నుగా ఉంటామని స్పష్టం చేశారు.

**స్థానిక విజయమే లక్ష్యంగా ముందడుగు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్టీ బలాన్ని మరింత పెంచుకోవచ్చని హర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయా పంచాయతీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయన పర్యటనతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మూలం చంద్రమోహన్ రెడ్డి, విడుదల మాదవరెడ్డి, చిన్నియాదవ్ తో పాటు రాష్ట్ర, జిల్లా, మండలం, పంచాయతీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అనుభవానికి పట్టం కడితే.. నాయుడుపేట అభివృద్ధికి కొత్త దిశ!

- సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి..
- విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి వరకు రాజకీయ ప్రస్థానం..
- నాయుడుపేట అభివృద్ధికి ఆయన నాయకత్వం అవసరం!

ప్రజాభూమి ప్రతినిధి తడుకు చందు నాయుడుపేట...

తిరుపతి జిల్లా నాయుడుపేటలో స్థానిక సంస్థ ఎన్నికల పైన రోజురోజుకీ వేడెక్కుతున్న రాజకీయం. నాయుడుపేట లో విద్యార్థి దశలోనే ప్రజాసేవను లక్ష్యంగా ఎంచుకుని, అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ స్థాయిల్లో రాజకీయ బాధ్యతలు నిర్వహించిన నాయకుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి. అలాంటి అనుభవం, నాయకత్వ లక్షణాలు, రాజకీయ పరిచయాలు కలిగిన ఆయనకు నాయుడుపేట మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే పట్టణ అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని ఆయన అభిమానులు, మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థి దశ నుంచే నాయకత్వ ప్రస్థానం!**

సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తన ఇంటర్మీడియట్ విద్యాభ్యాస సమయంలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. అనంతరం నెల్లూరు జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం, తదనంతరం భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలోని తిరుపతి జిల్లాలో భారతీయ జనతా పార్టీ జిల్లా సారథిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు పార్టీకి సేవలందించడంతో పాటు, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.

**అనుభవం ఉంది.. నాయకత్వ పటిమ ఉంది.. మరి నాయుడుపేటకు అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?**

విద్యార్థి సంఘం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ బాధ్యతల వరకు ప్రయాణించిన నాయకుడికి స్థానిక పట్టణ అభివృద్ధి బాధ్యతలు అప్పగిస్తే తన అనుభవాన్ని ప్రజల కోసం వినియోగించే అవకాశం ఉంటుందని ఆయన అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

నాయుడుపేట మున్సిపాలిటీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ



పథకాలు, అభివృద్ధి నిధులు, ఉన్నత స్థాయి రాజకీయ పరిచయాలను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించుకునే దిశగా కృషి చేసే నాయకత్వం పట్టణానికి అవసరమని చెబుతున్నారు.

**పదవి కోసం కాదు.. పట్టణ ప్రగతి కోసం!**

నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పదవి అనేది కేవలం ఒక హోదా కాదు.. పట్టణ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత! విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో పనిచేసి, వివిధ స్థాయిల్లో అనుభవం సంపాదించిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి ఆ బాధ్యత అప్పగిస్తే నాయుడుపేట అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. రాజకీయ అనుభవాన్ని ప్రజా సేవకు అనుసంధానం చేస్తూ, పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నాయుడుపేటను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలంటే ఆయనకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

**నాయుడుపేట అభివృద్ధి కోసం ఒక బలమైన నిర్ణయం అవసరం!....**

విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి వరకు సాగిన రాజకీయ ప్రస్థానం.. ప్రజా జీవితంలో సంపాదించిన అనుభవం.. అభివృద్ధి పట్ల నిబద్ధత.. ఈ లక్షణాలను నాయుడుపేట ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం రావాలి! సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి నాయుడుపేట మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తే, పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన అనుభవాన్ని వినియోగిస్తారనే ఆశాభావాన్ని ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేట అభివృద్ధికి దోహదపడే నాయకత్వానికి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. నాయుడుపేటకు కావాల్సింది కేవలం ఒక చైర్మన్ కాదు.. అభివృద్ధిపై స్పష్టమైన దృష్టి, రాజకీయ అనుభవం, ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వం! అలాంటి అవకాశం సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి కల్పించాలని ఆయన మద్దతుదారులు ఆకాంక్షిస్తున్నారు.

## తుడా పరిధిలోని అభివృద్ధి పనులకు రూ. 200 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి నిధుల వినియోగం తితిదే అందించిన చేయూతపై హర్షం వ్యక్తం చేసిన తుడా తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి శరత్ కుమార్,ని తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి , వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. తుడా పరిధిలోని వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనుల నిమిత్తం తితిదే ద్వారా తుడా కు రూ. 200 కోట్ల నిధులు విడుదల చేసినందుకు గాను వారు జేఈఓ కి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ:ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం తిరుపతికి వచ్చే లక్షలాది మంది భక్తులతో పాటు, స్థానిక నగర పౌరుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడమే తుడా ప్రధాన కర్తవ్యమన్నారు. తుడా పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణ నిమిత్తం తితిదే ద్వారా రూ. 200 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. నిధులను విడుదల చేసి తుడా కు వెన్నుదన్నుగా నిలిచిన తితిదే బోర్డుకు తుడా యంత్రాంగం తరపున, తిరుపతి ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తుడా వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు మాట్లాడుతూ:తితిదే, తుడా సమన్వయంతో నగరంలో మౌలిక వసతుల విస్తరణకు ఈ నిధులు ఎంతగానో దోహద పడతాయన్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉండే పరిసర ప్రాంతాల్లో ప్రజా సౌకర్యాల మెరుగుదలకు తితిదే ఎల్లప్పుడూ ముందుంటోంది అని తెలిపారు. తుడాకు ఆర్థిక వెన్నుదన్నుగా రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేసి ప్రోత్సహించినందుకు తితిదే యాజమాన్యానికి ప్రత్యేకధన్యవాదాలు ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, ఎస్ ఈ రవీంద్రయ్య పాల్గొన్నారు.

## చంద్రగిరి మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం..!

### మరమ్మతులు, నిర్వహణ మెరుగుదలకు విద్యుత్ శాఖ చర్యలు..

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరించి, సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం అనగా 10.10.2026 ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. చిన్న రెడ్డప్ప తెలిపారు.విద్యుత్ లైన్లు, ఇతర విద్యుత్ పరికరాల నిర్వహణ పనుల ద్వారా సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్ సరఫరా నిలిపివేత సమయాన్ని గమనించి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిపివేత కారణంగా కలిగే తాత్కాలిక అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

## ఫార్మా, మెడికల్ రంగాల్లో ఆవిష్కరణలే లక్ష్యం

### -: స్విమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉమామహేశ్వరరావు..!





ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఎంబి స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో "ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ ఫార్మాస్యూటికల్, బయో అండ్ మెడికల్ సైన్సెస్" అనే అంశంపై జరిగిన ఈ సదస్సు ముగింపు వేడుకలకు తిరుపతి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వస్తున్న నూతన పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక పురోగతి వైద్య, ఫార్మా రంగాల్లో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. విద్యార్థులు, యువ పరిశోధకులు ఈ సదస్సు ద్వారా పొందిన విజ్ఞానాన్ని తమ భవిష్యత్తు పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎంబి స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డిప్యూటీ డీన్ డాక్టర్ జయప్రకాష్, ఎంబీయూ వైస్ ఛాన్సలర్ పివి రమణ, రిజిస్ట్రార్ సారథి మూడు రోజుల పాటు నిర్వహించిన విద్యా, పరిశోధనాత్మక కార్యక్రమాల విజయవంతమైన తీరును కొనియాడారు. కాన్ఫరెన్స్ కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రపంచం నలుమూలల నుండి దాదాపు 200 మంది ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ విలువైన పరిశోధనా పత్రాలను సమర్పించారని, విద్యా సంబంధిత అవగాహనను పంచుకున్నారని తెలిపారు. అనంతరం సదస్సులో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ప్రతినిధులకు ప్రశంసా పత్రాలను అందజేసి, జాతీయ గీతాలాపనతో ఈ అంతర్జాతీయ సదస్సుకు ఘనంగా ముగింపు పలికారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు

శనివారం 10 అక్టోబరు 2026



# జాతీయ తపాలా వారోత్సవాలు - 2026

## తపాలా పొదుపు పథకాలు, ఆర్థిక అక్షరాస్యత, అంతర్జాతీయ పార్శిల్ సేవలపై అవగాహన 9 నుండి 15 వరకు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి డివిజన్ తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ తపాలా వారోత్సవాలు -- 2026ను అక్టోబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భారత తపాలా శాఖ అందిస్తున్న వివిధ తపాలా సేవలు, పొదుపు పథకాలు,బీమా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ప్రజల్లో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం మరియు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భద్రత ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. భారత తపాలా శాఖ ప్రజల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వివిధ పొదుపు పథకాలను అందిస్తోంది. వాటిలో పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్, టైమ్ డిపాజిట్, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి ఖాతా వంటి పథకాలు ఉన్నాయి. ఈ పథకాలు ప్రజలు క్రమం తప్పకుండా పొదుపు చేసుకోవడానికి, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడానికి మరియు భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా పెట్టుబడులు పెట్టడానికి ఉపయోగపడతాయి. సుకన్య సమృద్ధి ఖాతా ఆడపిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసే అవకాశాన్ని కల్పిస్తుండగా, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ అర్హులైన వృద్ధులకు పెట్టుబడి అవకాశాన్ని అందిస్తుంది. ఇతర పొదుపు పథకాలు కూడా వ్యక్తులు మరియు కుటుంబాల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఉపయోగ పడతాయి.పొదుపు పథకాలతో పాటు, భారత తపాలా శాఖ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా అర్హులైన వినియోగదారులకు జీవిత బీమా సేవలను అందిస్తోంది. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో తపాలా శాఖ కీలక పాత్ర పోషిస్తోంది.అదేవిధంగా, విదేశాల్లో నివసిస్తున్న తమ కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులకు పార్శిళ్లు పంపించేందుకు భారత తపాలా శాఖ అంతర్జాతీయ పార్శిల్ సేవలను అందిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తమ సమీప తపాలా కార్యాలయం ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు. విదేశాల్లో నివసిస్తున్న తమ ఆత్మీయులకు పార్శిళు



పంపించాలనుకునే ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించడమైనది. అంతర్జాతీయ పార్శిల్ సేవల లభ్యత, అనుమతించబడిన వస్తువులు, వర్తించే చార్జీలు మరియు బుకింగ్ విధానాల గురించి వివరాల కోసం సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.జాతీయ తపాలా వారోత్సవాలు -- 2026 సందర్భంగా తిరుపతి డివిజన్ పరిధిలోని ప్రధాన తపాలా కార్యాలయాలు, ఉప తపాలా కార్యాలయాలు, శాఖ తపాలా కార్యాలయాల ద్వారా పొదుపు పథకాలు, బీమా సేవలు మరియు అంతర్జాతీయ పార్శిల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ప్రజలు తమ సమీప తపాలా కార్యాలయాన్ని సందర్శించి, అందుబాటులో ఉన్న పథకాలు మరియు సేవలు, అర్హతలు, డిపాజిట్ పరిమితులు, ప్రస్తుత వడ్డీ రేట్లు మరియు ఇతర ప్రయోజనాల గురించి వివరాలు తెలుసుకోవాలని సూచించడమైనది. ఈ సందర్భంగా తిరుపతి డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ మేజర్ సయ్యదా తన్వీర్ గారు ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న వివిధ పొదుపు పథకాలు, బీమా సేవలు మరియు అంతర్జాతీయ పార్శిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. క్రమబద్ధమైన పొదుపు అలవాటును పెంపొందించుకొని తమ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించుకోవడంతో పాటు, విదేశాల్లో నివసిస్తున్న తమ ఆత్మీయులకు పార్శిళ్లు పంపించేందుకు తపాలా శాఖ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలకు విశ్వసనీయమైన, సులభంగా అందుబాటులో ఉండే తపాలా మరియు ఆర్థిక సేవలను అందించేందుకు తపాలా శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు

# కుతంత్రాలను తిప్పికొడదాం.. స్థానిక సమరానికి సిద్ధమవుదాం..!

## కార్యకర్తలకు అండగా ఉంటా.. ప్రతిపోరాటంలోమీతోనే ఉంటా.. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపు..





ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

అధికార పార్టీ ప్రలోభాలకు లొంగొద్దు.. బెదిరింపులకు భయపడొద్దు.. కలిసికట్టుగా స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, అవసరమైతే ప్రతి గ్రామానికీ వచ్చి వారితో కలిసి పోరాడతానని భరోసా ఇచ్చారు. చంద్రగిరి మండలం కొటాల, చిన్న రామాపురం, కందులవారిపల్లి, ఏ.రంగంపేట, రామిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి, మిట్టపాళెం గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

**ప్రజలతో అనుబంధమే మన బలం..**

గతంలో ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రజలతో తమకున్న అనుబంధమే పార్టీకి బలమని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరే వరకు పోరాటం ఆపొద్దని కార్యకర్తలకు సూచించారు. టీడీపీ కుతంత్రాలను ఐక్యంగా తిప్పికొడుతూ, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.

**బెదిరింపులకు భయపడొద్దు..**

అధికార పార్టీ నేతల ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని మోహిత్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలపై దాడులు జరిగినా, బెదిరింపులు వచ్చినా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆనాడు వైఎస్ జగన్ కేసులకు భయపడి ఉంటే వైఎస్సార్‌సీపీ ఉండేదా? అని ప్రశ్నించారు. పార్టీ శ్రేణులు ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా ప్రజల పక్షాన నిలవాలని సూచించారు.

**దౌర్జన్యాలు మన విధానం కాదు..**

దౌర్జన్యాలు చేయడం తమ విధానం కాదని, తమపై దాడులకు దిగితే మాత్రం సహించేది లేదని మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో సామరస్య పూర్వకంగా ఎన్నికలు నిర్వహించామని, అదే తమ సంస్కారమని చెప్పారు.

**రెండేళ్ల టీడీపీ పాలనలోని**

వైఫల్యాలపై ఆ పార్టీ నేతల్లోనే అసంతృప్తి ఉందని వ్యాఖ్యానించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో ఐక్యతే ఆయుధంగా ముందుకు సాగాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడి విజయం సాధించాలని మోహిత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చివరగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన గుర్తింపు కార్డులను నాయకులు, కార్యకర్తలకు అందించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డిలతో పాటు పలువురు సీనియర్లు, ఆయా పంచాయతీల పార్టీ నేతలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో 2047 నాటికి 50 శాతం పచ్చదనం లక్ష్యంగా జిల్లా గ్రీనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు

- వివిధ శాఖల సమన్వయంతో భారీ వృక్షారోపణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు
- మొక్కలు నాటడమే కాకుండా అవి చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలి
- లక్ష్య సాధనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి ని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు
- ఈ ఏడాది జిల్లాలో 53 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం: సోషల్ ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,

తిరుపతి జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించి, 2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించే దిశగా జిల్లా గ్రీనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఏపీ గ్రీన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం--2001 ప్రకారం సంస్థ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నందు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అటవీ శాఖ సోషల్ ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ శాఖ , ఉద్యాన శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర సంబందిత శాఖల అధికారులతో కలసి జిల్లాలో పచ్చదనం పెంపుదల లక్ష్యంగా జిల్లా హరితాభివృద్ధి సంస్థ తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో అటవీ ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతాల వెలుపల కూడా వృక్ష సంపదను విస్తరించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, భారీ స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా గ్రీనింగ్ కార్పొరేషన్ పరిధి తిరుపతి జిల్లా అంతటా ఉండనుందని, జాయింట్ కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించే పాలక మండలిలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులకు ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పాలక మండలిలో అటవీ శాఖ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ , డ్వామా, జిల్లా పంచాయతీ కార్యాలయం, వ్యవసాయ, ఉద్యానవన, పరిశ్రమల శాఖల ప్రతినిధులు భాగస్వాములుగా ఉండనున్నారు. జిల్లా పరిషత్ సీఈఓతో పాటు అవసరమైన ఇతర సంబంధిత శాఖల అధికారులను కూడా కమిటీలో చేర్చే అంశాన్ని పరిశీలించనున్నారు. సంస్థ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పాలక మండలి సమావేశం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు.జిల్లాలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, వ్యవసాయ ఆధారిత అటవీ పెంపకం, గృహ ఆవరణలు, సంస్థాగత ప్రాంగణాలు, పారిశ్రామిక ప్రాంతాలు, రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్లు, గ్రామీణ ప్రాంతాల్లో భారీ వృక్షారోపణ కార్యక్రమాలను ప్రోత్సహించనున్నారని తెలిపారు. మెమోరియల్ పార్కులు, పవిత్ర వనాలు, బొటానికల్ గార్డెన్లు, పట్టణ పార్కులు, గ్రీన్ స్పేస్‌ల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోనున్నారన్నారు. నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, పంపిణీ కోసం నర్సరీల నమోదు, గుర్తింపు, అక్రిడిటేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారని తెలిపారు.జియో-ట్యాగింగ్, కృత్రిమ మేధస్సు , సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొక్కల నాటకం, పెరుగుదల, సంరక్షణను పర్యవేక్షించనున్నారని, గనుల తవ్వకాలు, పారిశ్రామిక కాలుష్యంతో దెబ్బతిన్న భూములను పునరుద్ధరించడంతో పాటు వాతావరణ మార్పులను తట్టుకోగల వృక్ష జాతుల ఎంపికలో పరిశోధనా సంస్థల సహకారం తీసుకోనున్నారని తెలిపారు. చెట్ల పెంపకందారులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, కార్బన్ మార్కెట్ అనుసంధానం, చెట్ల ఆధారిత ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను కూడా చేపట్టనున్నారన్నారు. రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి పనుల సమయంలో సాధ్యమైన చోట పెద్ద చెట్లను మరో ప్రాంతానికి తరలించి పునరునాటే విధానాన్ని (ట్రీ ట్రాన్స్‌లోకేషన్) ప్రోత్సహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రహదారులు--భవనాల శాఖ, ఇతర అభివృద్ధి సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, అభివృద్ధి పనుల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించనున్నారు.జిల్లా గ్రీనింగ్ కార్పొరేషన్ ఏపీ గ్రీన్ పరిధిలో జిల్లా స్థాయి యూనిట్‌గా పనిచేయనుందని, సంస్థ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, నిధుల కేటాయింపు, వ్యయాల సమీక్ష, ఆడిటింగ్, వార్షిక కార్యాచరణ ప్రణాళికల అమలులో ఏపీ గ్రీన్ మార్గదర్శకాలను అనుసరించనున్నదన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులు, వ్యక్తులు, సంస్థల విరాళాలు, ఇతర చట్టబద్ధ ఆర్థిక వనరులను సమీకరించి హరితాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నారని తెలిపారు. నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, పరిశ్రమలు, జాతీయ రహదారుల సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థల సమన్వయంతో తిరుపతి జిల్లాలో పచ్చదనం పెంపు, వృక్ష సంపద సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.సోషల్ ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ హరితాంధ్రప్రదేశ్'లో భాగంగా 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా తిరుపతి జిల్లాలో సమగ్ర హరితాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని సోషల్ ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ మొక్కల పెంపకం, నాటడం, సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.తిరుపతి జిల్లాలో ప్రస్తుతం సుమారు 41 శాతం గ్రీన్ కవర్ ఉందని, 50 శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో 70 వేల హెక్టార్ల మేర పచ్చదనాన్ని విస్తరించాల్సి ఉందని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 53 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అటవీ శాఖకు చెందిన 11 నర్సరీల్లో సుమారు 8 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రహదారుల వెంట, గ్రామ ఉమ్మడి భూముల్లో, కాలువల గట్లపై, కొండ ప్రాంతాల్లో, పట్టణ పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 300 కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్లు, తీరప్రాంతాల్లో ఐదేళ్లలో 3,350 హెక్టార్ల మేర హరితాభివృద్ధి చేపట్టే లక్ష్యాలతో ముందుకు సాగుతున్నామని వివరించారు.మిషన్ హరితాంధ్రప్రదేశ్ మొబైల్ యాప్ ద్వారా మొక్కల నాటకం, జియో-ట్యాగింగ్, సంరక్షణ వివరాలను నమోదు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, నిధులను సమన్వయంతో వినియోగించుకుంటూ నర్సరీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రజలను హరిత కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ కోసం ప్రజలంతా సహకరించాలని పవన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్ళురుపేట డీఎఫ్ఓ శ్రీనివాస్ రెడ్డి, డిడి డి ఐ సి జవహర్ బాబు, డిప్యూటీ సి ఈ ఓ వెంకటనారాయణ, డిపి ఓ సుశీలా దేవి, సి పి ఓ రాజశేఖర్, తిరుపతి డి డి ఓ గంగాభవాని, శ్రీకాళహస్తి డిడి ఓ సుస్మిత, సూళ్లూరుపేట డి పి ఓ రెడ్డెప్ప, హార్టికల్చర్ అధికారి శివకుమారి, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజానాయక్, వ్యవసాయ అధికారి ప్రసాద రావు, డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ ఈ, తదితర కమిటీ సభ్యులు ఇతర ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు






# అబాకస్‌లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

## ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్‌గా నిలిచిన 5 మంది విద్యార్థులు



ప్రజా భూమి ప్రతినిధి

శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు విద్యలోనే కాకుండా అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చాటుకున్నారు. అబాకస్ అండ్ మెంటల్ అరిథ్మెటిక్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నైలో ఈనెల 26న నిర్వహించిన ఇంటర్నేషనల్ డైరెక్ట్ ఓపెన్ టు ఆల్ అబాకస్ కాంపిటీషన్ లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నారు.ఈ పోటీల్లో మొత్తం 5 మంది విద్యార్థులు 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్' అవార్డులను కైవసం చేసుకుని పాఠశాలకు, శ్రీకాళహస్తికి గర్వకారణంగా నిలిచారు.

విజేతల వివరాలు: 1. ఎం. స్వప్నిల్ (9వ తరగతి సి2): అబాకస్‌లోని మొత్తం 8 స్థాయిలను విజయవంతంగా పూర్తి చేసి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ అవార్డును అందుకున్నాడు.

2. ఎస్. యశ్వంత్ (9వ తరగతి ఎల్ 2): 3వ లెవెల్ పూర్తి చేసి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ గా నిలిచాడు.3. కె. జోషిత్ (6వ తరగతి - ఎల్ 5): 1వ లెవెల్ పూర్తి చేసి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ అవార్డును సాధించాడు.4. ఎం. షణ్ముఖ ప్రియ (4వ తరగతి): 1వ లెవెల్ పూర్తి చేసి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ గా నిలిచింది.5. జి. నితిన్ (4వ తరగతి): 2వ లెవెల్ పూర్తి చేసి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ అవార్డును కైవసం చేసుకున్నాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ.. "విజయం అనేది ఒక్కరోజులో వచ్చేది కాదు. నిరంతర సాధన, ఏకాగ్రత, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిసినప్పుడే అసాధారణ విజయాలు సాధ్యమవుతాయి. మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఎంతో గర్వకారణం" అని అన్నారు.ఏ.జి.ఎం సురేష్ విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇన్చార్జులు కల్పన, శ్రీహరి పాల్గొన్నారు.

# శ్రీ కామాక్షి దేవి ఆలయంలో 11 నుండి దేవీ నవరాత్రి ఉత్సవాలు

## నవరాత్రి ఉత్సవాల పోస్టర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని.



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం.

మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి, శ్రీ భవాని జలకన్టేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 11 నుండి 20వ తేదీ వరకు దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వహకులు తంజావూరు మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం దేవీ నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలను ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ 9 రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. మండల ప్రజలు దేవీ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని , ఆధ్యాత్మిక దైవచింతలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు హోమాలు, కుంకుమార్చన ఉంటుందన్నారు. 20వ తేదీన అమ్మవారి వాహన సేవ, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో ప్రతిరోజు భక్తులకు అమ్మవారి అన్న ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తంజావూరు వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి, ఈతమాకుల ఉమాపతి నాయుడు, కుప్పా త్యాగరాజు, కేశవుల నాయుడు, కే నరసింహారెడ్డి, మల్లి రెడ్డి, దాసు, భూపతిరెడ్లు పాల్గొన్నారు.

# భర్త మద్యం మత్తుకు బానిసవటంతో భార్య ఆత్మహత్య

## - రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

భర్త మద్యం మత్తకు బానిస కావడంతో కుటుంబాన్ని పట్టించుకోవడంలేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేణిగుంట మండలంలోని తారకరామానగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం, కట్టకిందపల్లి (ఉప్పువడ్డేపల్లి) గ్రామానికి చెందిన ఎం. రవి, ఎం. సులోచన దంపతుల కుమార్తె కీర్తి (30)కి, సోమల మండలం వడ్డీపల్లికి చెందిన సునీల్ కుమార్‌తో దాదాపు 12 సంవత్సరాల క్రితం వివాహం . వీరికి ఒక కుమార్తె (11), కుమారుడు (9) ఉన్నారు. ప్రస్తుతం వీరు రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్ (ప్లాట్ నెం. 2110) నందు నివాసం ఉంటున్నారు. సునీల్ కుమార్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సునీల్ కుమార్ మద్యానికి బానిసై సంపాదనను వ్యసనానికే ఖర్చు చేస్తూ, భార్య పిల్లలను భార్యా పిల్లలను పట్టించుకునేవాడు కాదు. ఈ విషయమై పెద్దలు పలుమార్లు సర్దిచెప్పినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 08-10-2026 రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో సునీల్ కుమార్ మద్యం తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం రాత్రి సుమారు 11:00 గంటలకు ఇంట్లో అందరూ నిద్రపోయిన సమయంలో తీవ్ర మనస్తాపానికి గురైన కీర్తి, బయటకు వచ్చి గడియపెట్టి, ఇంటి బయట వరండాలోని పైకప్పు ఇనుప కడ్డీకి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. మధ్యరాత్రి సుమారు 12:15 గంటల సమయంలో మెలకువ వచ్చి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న మృతురాలి తల్లి ఎం. సులోచన ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి రుయా/ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న రేణిగుంట పోలీసులు.

# ప్రజాభూమి

## తిరుపతి,చిత్తూరు

10

శనివారం 10 అక్టోబరు 2026


## తిమ్మంపల్లి హైస్కూల్లో డ్రగ్స్‌పై అవగాహన...

### చదువు పైనే దృష్టి సారించాలన్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి



ప్రజా భూమి యల్లనూరు: తిమ్మంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులు డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువు పై దృష్టి సారించి విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై ఎస్సై రామాంజనేయరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్, మరియు ఇతర మత్తు పదార్థాల పైన పిల్లలకు అవగాహన కల్పించారు సమావేశ అనంతరం హై స్కూల్ నుంచి ర్యాలీగా బయలుదేరి తిమ్మంపల్లి మెయిన్ సర్కిల్ నందు డ్రగ్స్ ను నిర్మూలిద్దాం సమాజాన్ని కాపాడుకుందాం అనే నినాదాలు చేశారు గ్రామ ప్రజలకు మండల ప్రజలకు తెలియజేయునది ముఖ్యమైన విషయం ఎస్ఐ తెలియపరుస్తూ డ్రగ్స్ విక్రయించడం వినియోగించడం తీవ్రమైన నేరమని మత్తు పదార్థాల విక్రయాలు వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినవారు వెంటనే పోలీసువారికి తెలియజేయాలని అటువంటి నేరాలకు పాల్పడిన వారిపైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యాలను నిర్దేశించుకుని తమ తల్లిదండ్రులు ఆశించిన ఉన్నత స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారి 2 సిహెచ్ పరమేశ్వర్ రెడ్డి తిమ్మంపల్లి పిహెచ్ సి ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ సాయి నాగశ్రీ ఇంకొన్ని సూచనలు సలహాలు పిల్లలకు తెలియజేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఓ. గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరై మంచి నడవడికను ఉన్నత విద్యలను అభ్యసించాలన్న మీ ఆశీర్వాదాలు ఎల్లప్పుడు మా హై స్కూల్ పిల్లలకు కల్పించడం నాకు ఎంతో సంతోషకరంగా ఉందని ఆనందం వ్యక్తపరుస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

## ప్రజా భూమి వార్తకు స్పందన..

### పది రోజులు కూడా నిలవని ప్యాచ్‌వర్క్!

ప్రజా భూమి నార్పల

నార్పల--కేశేపల్లి--నాయనపల్లి క్రాస్ రహదారి దుస్థితిపై ప్రజాభూమి దినపత్రికలో ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. దీంతో అధికారులు రహదారిపై ప్యాచ్‌వర్క్ మరమ్మతులు చేపట్టారు. అయితే ఈ మరమ్మతులు కనీసం పది రోజులు కూడా నిలవకపోవడంతో రహదారి పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యపై స్పందించి మరమ్మతులు చేపట్టడం అభినందనీయమే అయినప్పటికీ, అవి ఎక్కువ రోజులు నిలవకపోతే ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రూ.50 లక్షల రహదారి పనులు కేవలం ప్యాచ్‌వర్క్‌కే పరిమితమవుతాయా? లేక రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా? అన్నది వేచి చూడాలి. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన పనులు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


PRAJABHOOMI-04-10-2026-AP-ANANTAPUR Page 6 04 Oct 2026
https://epaper.prajabhoomi.com/clip/37227
రూ.50 లక్షల రహదారికి నాలుగు నెలల్లోనే ప్యాచ్ వర్కులు!
నార్పల--కేశేపల్లి మీదుగా నాయనపల్లి రహదారిలో పరిస్థితి

## కదిలిస్తే కదులుతుంది మురుగు నీరు...?

### మురుగు కాలువ చూస్తూ కదలిరాని అధికారులు...!



ప్రజా భూమి యల్లనూరు: యల్లనూరు మండల నివాస ప్రాంతాల ప్రక్కన కనిపిస్తున్నది కాలువ కాదండోయ్.. ఇది సంవత్సరాల తరబడి పేరుకుపోయిన బురద నీటితో కూడిన మురుగు కాలువ కాకపోతే పారిశుద్ధ కార్మికుల లోపము లేక అధికారులు దీనిపైన స్పందించ లేదో దేవుడికే తెలియాలి ఎన్నోమార్లు మండల కేంద్రానికి ప్రజా ప్రతినిధులు పలుమార్లు వచ్చిన కంటికి కనిపించదా అంటే దాదాపుగా ఎనిమిది మీటర్లు వెడల్పు 30 నుంచి 40 మీటర్ల దాకా పొడవు చూస్తూనే కంటికి కనిపిస్తుంది ఇది యల్లనూరు మండల ప్రజా పరిషత్ వారి యొక్క పారిశుధ్యం.. అక్కడ నివాసితులను అడిగితే ఎన్నోమార్లు ఈ సమస్య పైన అధికారులు అడిగినా కూడా వారిలో చలనం లేదని నిర్వాసితులు వాపోతున్నారు ఇదిలా ఉంటే చిన్నపిల్లలు చీకటి పడక ముందే ఎక్కడ విష సర్పాల నుండి పిల్లలను కాపాడుకోవాలంటే ఒక విధంగా తల్లిదండ్రులు నైట్ వాచ్మెన్ ఉద్యోగమే చేస్తున్నట్లు సమాచారం -పగలంతా వ్యవసాయ పొలాలకు వెళ్లి, కూలి నాలి చేసుకుని జీవనం సాగిస్తున్న వారిని అడిగితే ఇంట్లో ఉన్న వీధిలో ఉన్న ఒకటే అని ఇకనైనా ఈ మురుగు కాలువను శుభ్రం చేయించి ఇక్కడ చిన్న కల్వర్టు నుండి మురుగు నీరు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా కూడా ఉంది వీటి స్థానంలో రోడ్డు కల్వర్టు వెడల్పు చేసినట్లయితే మురుగు నీరు ఆగకుండా వెళుతుందని అక్కడివారు కోరుతున్నారు ఈ విషయం పైన ఎమ్మెల్యే శ్రావణి ఇక్కడ నిర్వాసితుల పైన ప్రత్యేక దృష్టి కొనసాగించి మమ్మల్ని ఆదుకోవాలని మా ప్రాణాలను కాపాడాలని కోరుతున్నాము.

## బాలభటులు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలి

ప్రజా భూమి - సంబేపల్లి

విద్యార్థులు స్కౌటింగ్‌లో పాల్గొని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతోపాటు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం సంబేపల్లి మండలం మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన స్కౌట్, గైడ్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్కౌటింగ్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెంపొందుతాయని తెలిపారు. నైతిక విలువలను అలవర్చుకోవడంతోపాటు శారీరక, మానసిక వికాసానికి స్కౌటింగ్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. స్కౌటింగ్‌లో శిక్షణ పొంది ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 27 ప్రకారం ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, వైద్య విద్య వంటి కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి రిజర్వేషన్ సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ లను ఏర్పాటు చేయుటకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రతి విద్యార్థి స్కౌటింగ్‌లో భాగస్వామి అయి సమాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

## చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవీ నవరాత్రులు

### -విశిష్ట ఏర్పాట్లకు అధికారులతో ఎమ్మెల్యే పులివర్తినాని సమీక్ష..!

- ఈ నెల 11 నుంచి 20 వరకు దేవీ నవరాత్రి మహోత్సవాలు.. అధికారులతో విస్తృత సమన్వయ భేటీ..
- భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, విద్యుత్, పటిష్ట పోలీసు బందోబస్తుకు ఆదేశం..
- బైపాస్ రోడ్డు నుంచి ఆలయానికి నేరుగా నూతన రహదారి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ..
- ఆలయ పరిసరాల్లో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం మోపాలని, బెల్ట్ షాపులు తొలగించాలని పోలీసులకు ఆదేశం..





ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి లోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా చేపట్టేందుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, ఉభయదాతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులతో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.

**భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు - - శాఖల సమన్వయం:**

ఉత్సవాలకు పోటెత్తే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. భక్తుల అత్యవసర సేవల కోసం 108 అంబులెన్సులు, ప్రత్యేక వైద్య శిబిరాలు, ఫైర్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, క్రమబద్ధమైన క్యూలైన్లు మరియు నిరంతర పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు, పూల అలంకరణలు చేపట్టాలని సూచించారు. పది రోజుల పాటు సాగే వాహన సేవలకు, అన్నదాన కార్యక్రమాలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఉభయదాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. రాజకీయాలు, పార్టీలకతీతంగా స్థానిక ప్రముఖులు, పట్టణ ప్రజలు ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మ విశిష్టతను రాష్ట్రవ్యాప్తంగా నలుదిశలా చాటిచెప్పేలా అభివృద్ధి చేస్తామని, బైపాస్ నుంచి నేరుగా ఆలయానికి చేరుకునేందుకు అవసరమైన నూతన రోడ్డు సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు కఠిన ఆదేశాలు:**

ఆలయ సమీపంలో కొందరు ఉదయమే మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఎమ్మెల్యే నాని తీవ్రస్థాయిలో స్పందించారు.

ఆలయ పవిత్రతను దెబ్బతీసే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఆలయ పరిసరాల్లో అనధికార బెల్ట్ షాపులు, మద్యం పాయింట్లు ఏమైనా ఉంటే తక్షణమే తొలగించాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా దర్శనానికి వచ్చే మహిళా భక్తులకు ఎలాంటి భయభ్రాంతులు, అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాలని పోలీసు శాఖకు స్పష్టం చేశారు.

## ప్రధానమంత్రి సురక్ష మాతృత్వభయాన్

ప్రజా భూమి - గోపవరం

తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షి త్ మాతృత్వభయాన్ ప్రోగ్రాం జరగడమైనది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ శివలత సంజీవిని ప్రవేట్ హాస్పిటల్ పాల్గొని గర్భిణీ స్త్రీలు అందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించడమైనది. ఈ కార్యక్రమంలో సంజీవిని ప్రైవేట్ హాస్పిటల్ మేనేజ్మెంట్ డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో ప్రతి గర్భిణీ స్త్రీలు పోషకాహారం లోపం లేకుండా అందరికీ పోషకాహారం అల్పాహారము అందించడమైనది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ మరియు డాక్టర్ జి రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ సురక్షితం కాన్పు కొరకు ముందుగా డాక్టర్ దగ్గర కనీసం నాలుగు సార్లు పరీక్షలు చేపించుకొని గర్భంలో శిశువు రక్తహీనత గుర్తించడము,బీపీ షుగర్ మొదలగు లక్షణాలను గుర్తించడం కష్టతరమైనటువంటి గర్భిణీ స్త్రీలకు 102 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి ఉచితంగా రక్త పరీక్షలు రక్తం తక్కువ ఉన్నటువంటి వారికీ రక్తము ఎక్కించడము ఐరన్ సుక్రోస్ ఇంజక్షన్ రూపంలో ఇవ్వడం మొదలగునవి జరుగునని,ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రులకు గర్భిణీ స్త్రీలను బాలింతలను,చిన్న పిల్లలను అత్యవసర సమయంలో 108 వాహనం ఉపయోగించుకోవాలని గర్భిణీ స్త్రీలందరికీ అవగాహన కల్పించడం అయినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య పాల్గొని గర్భస్థ పిండము నందు ఆడ మగ అనే లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్య నేరమని, మొదటికాన్పులో బాలిక ఉన్నట్లయితే రెండో కాన్పు నందు ఆడ మగ లింగ నిర్ధారణ చేయకూడదని ఇది చట్టరిత్య నేరమని గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించడమైనది అదేవిధంగా బాల్య వివాహాలను అరికట్టాలని చిన్న వయసులోనే వివాహం చేయటం వలన గర్భవతి సమయంలో ఆరోగ్య సమస్యలు ఎదురవునని ఒకవేళ గర్భం ధరించితే గర్భవతి తీసుకొని జాగ్రత్తలను గురించి ఆరోగ్య విద్య ద్వారా వివరించడమైనది. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి జనార్దన్ రావు విలేజ హెల్త్ ఏ ఎన్ యం లు విలేజ్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆశా కార్యకర్తలు ప్రైమరీ హెల్త్ మొదలకు వారు పాల్గొనడం అయినది.



## బిసి రిజర్వేషన్లపై చంద్రబాబు మాటల గారడీ!

### బీసీలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం చేయించాలి - వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

ప్రజా భూమి -రాయచోటి

బీసీలకు మేలు చేస్తామంటూ చంద్రబాబు నాయుడు ఎప్పుడూ కూడా ఆర్భాటపు మాటలుతోనూ, తన నైజం మోసపుచ్చడమే అన్నది మరో సారి రుజువైందని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బీసీలకు మంచి చేయాలన్న ఆలోచనలు వుండవన్నారు. గతంలో దివంగత నందమూరి తారకరామారావు హాయంలోనూ బిసి లకు మంచి జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఆరోగ్యశ్రీ,ఫీజు రీఎంబర్స్ మెంట్ తదితర కార్యక్రమాలు అమలు చేయడంతో బిసి లకు మేలు జరిగిందని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు వల్ల ఎప్పుడూ బిసిలకు మేలు జరగలేదన్నారు. 34 శాతం రిజర్వేషన్ల విషయం సుప్రీం కోర్ట్ నిర్ణయం ప్రకారం చెల్లుబాటు కాదని తెలిసినా మోసపుచ్చి ,జయహో బిసి సభలు పెట్టి,డ్రామా ఆడారన్నారు. వారి చిత్ర పటాలకు పాలాభిషేకం కూడా చేయించుకున్నారన్నారు. మేము ముందునుంచి ఒక్కటే అడుగుతున్నామని,మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్ 9 ప్రకారం తమిళనాడులో ఏ విధంగా చట్టం చేశారో ,ఆ రకంగా చట్టం చేసుకోవడానికి, కేంద్రంతో మాట్లాడి పార్లమెంట్ లో చట్టం చేయడానికి ముందుకు రాలేదన్నారు. తన మద్దతుతో నడుస్తున్న ఎన్ డి ఏ ప్రభుత్వం పైన ఉందని, ఇది సరైన సమయమని, బిసి లకు మేలు జరగడానికి పార్లమెంట్ లో చట్టం చేయడానికి కలసిపోరాడుదాము అంటే ముందుకు రావడం లేదన్నారు. తన మద్దతుతో కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటారే కానీ బిసి లకు మేలు చేసేందుకు ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇలా మోసపూరిత పనులు చేయకూడదన్నారు. గతంలో వైఎస్ జగన్ బిసి లకు అన్నింట్లలోనూ,నామినేటెడ్ పోస్టులలో 50 శాతం ఉండాలన్న ఆలోచనలు చేసి అసెంబ్లీలో చట్టం చేసారన్నారు. రాయచోటి మున్సిపాలిటీ గతంలో ఓసి జనరల్ వచ్చినా బిసి లకు ఇచ్చి గౌరవించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. అలాగే నాయి బ్రాహ్మణులకు, రజకులుకు వారికి ఉపయోగ పడే విధంగా ఏడాదికి రూ 15 వేలు అందించారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు శాస్వితంగా ఉపయోగపడే పనులను ఎప్పుడూ చేయక ప్రజలను మోసాగిస్తూఉంటారన్నారు. చంద్ర బాబు నాయుడు కు బిసి ల రిజర్వేషన్లపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్ ప్రకారం పార్లమెంట్ లో చట్టం చేసేందుకు కేంద్రంతో మాట్లాడి ఒప్పించాలని, ఇందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా నిలుస్తుందన్నారు.




## రేణిగుంటలో రూ.1.20 కోట్ల కాపర్ వైర్ చోరీ కేసు ఛేదన...

### - ఇద్దరి అరెస్ట్.. చెరువులో దాచిన 7 టన్నుల కాపర్ వైర్ రికవరీ..




ప్రజా భూమి - రేణిగుంట

రేణిగుంట వద్ద చోటుచేసుకున్న రూ.1.20 కోట్ల విలువైన కాపర్ వైర్ చోరీ కేసును రేణిగుంట పోలీసులు చాకచక్యంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బెంగళూరులోని వేదాంత లిమిటెడ్ - స్టార్‌లైట్ కంపెనీ నుంచి శ్రీసిటీకి 7 టన్నుల కాపర్ వైర్‌తో వెళ్తున్న లారీని, ఎక్కువ లాభాలు సంపాదించాలనే దురాశతో డ్రైవర్ వినోద్ కుమార్ తన అనుచరుడు దినేష్‌తో కలిసి దారిమళ్లించాడు. రవాణాలో ఉన్న కాపర్ వైర్‌ను వేలూరు సమీపంలోని ఒక చెరువులో దాచిపెట్టి, లారీని రేణిగుంటలోని రమణ విలాస్ సర్కిల్ వద్ద వదిలేసి పరారయ్యారు. ఈ చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ జయచంద్ర, ఎస్ఐ శ్రీనివాసులు, క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది వేగంగా దర్యాప్తు ప్రారంభించారు. చెరువులో దాచిన వైర్‌ను అమ్ముకోవడానికి కొనుగోలుదారులు దొరక్కపోవడంతో, రేణిగుంటలో వదిలేసిన లారీని తీసుకెళ్లేందుకు తమిళనాడుకు చెందిన ఆర్. రాజా, కె. నవీన్ కుమార్ వచ్చారు. అప్పటికే అక్కడ నిఘా ఉంచిన పోలీసులు వారిని పట్టుకుని, వారు ఇచ్చిన వివరాల ఆధారంగా చెరువులోని రూ. 1.20 కోట్ల విలువైన 7 టన్నుల కాపర్ వైర్‌తో పాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు వినోద్ కుమార్, దినేష్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కేసును ప్రతిభావంతంగా ఛేదించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి, జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపి రివార్డులు ప్రకటించారు.

## మహిళా పోలీసు అధికారిణి ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపించాలి

### - సీఐకు వినతిపత్రం అందజేసిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ



ప్రజాభూమి, వేంపల్లె

న్యూఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో మహిళా పోలీసు అధికారిణికి సంబంధించిన ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ కోరారు. ఈ మేరకు వేంపల్లి సీఐ టి. నరసింహులుకు సుష్మతో పాటు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ.. న్యూఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమానికి సంబంధించిన వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్నాయని, విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు అధికారిణి పట్ల రాహుల్‌గాంధీ అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లు, సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలనుసేకరించి సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. విచారణలో నేరం జరిగినట్లు నిర్ధారణ అయితే, వర్తించే చట్టాలప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత వ్యక్తి రాజకీయ, సామాజిక హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మాధవి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు శ్రావణి, శ్రీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు సునీల్ కుమార్, టిడిపి నాయకుడు మల్లికార్జున, శ్రీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ తో సత్వర పరిష్కార చర్యలు





❖ కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నా ❖ రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

ప్రజాదర్బారులో వచ్చిన ప్రతీ సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేస్తున్నట్లు రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో వివిధ గ్రామాల నుండి వచ్చిన దరఖాస్తుదారులు సమస్యలు విన్న ఆమె ఆయా సమస్యల పరిష్కారం పై సంబంధిత అధికారులకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మౌళి క సదుపాయాల కల్పన కోసం వినతులు స్వీకరించారు. పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కావాలని కోరగా ఆమె ఇంజనీరింగ్ అధికారులతో అంచనాలు తయారు చేయించి సాధ్యమైనంత త్వరలో నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా స్థానిక నాయకత్వం దృష్టిలో పెట్టాలని సూచించారు. అక్కడ కూడా పరిష్కారం కాని పక్షంలో నేరుగా తనతో చెప్పాలని సూచించారు. ఇప్పటికే కూటమి శ్రేణుల నాయకత్వం వివిధ సమస్యలపై అధికారులకు విన్నవిస్తే వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని అధికారులకు సూచించినట్లు స్పష్టం చేశారు.

**కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడి సేవలందిస్తున్నా...** కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో కూటమి ధర్మానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఆమె క్యాంపు కార్యాల యంలో శుక్రవారం APIIC డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వ ర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే చాలా మట్టుకు ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ లు నెరవేర్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని శ్రేణులకు సూచించారు. కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమంలో ఎలాంటి రాజీ లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నడుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తల కష్టాలు ఉంటే నేరుగా తనతో చెప్పాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టిలో పెడితే సాధ్యమైనంత వరకు సహాయ చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపు కోసం ఎవరైతే చిత్తశుద్ధితో పనిచేస్తారో వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కూటమి శ్రేణులు తన దృష్టిలో పెట్టిన అనేక పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు విషయంలో రాజీ లేకుండా పనిచేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాన న్నారు. కూటమి శ్రేణులు పూర్తి స్థాయిలో ఐక్య తగా పనిచేస్తే అత్యధిక స్థానాలు, అత్యధిక శాతం ఓట్లు ఖచ్చితంగా వస్తాయన్నారు. తన వంతుగా ఏమి చేయాలో చెబితే సాధ్యమైనంత త్వరగా చేయడానికి సిద్దంగా ఉన్నట్లు పేర్కొ న్నారు. తంటికొండ పంచాయితీలో పార్టీ ఎన్ని కల విషయంలో కూడా చైతన్యం చేశారు. గ్రామ స్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి, వాటిని మనం ఎలా పరిష్కారం చేయగలం అనేది స్పష్టమైన అవగాహన కలిగి అంకితభావంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు ఖాయమ న్నారు. కార్యక్రమంలో APIIC డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, AMC చైర్మన్ లోతా లక్ష్మణరావు,PACS సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్, తెదేపా నాయకులు గణజాల తాతారావు, సావిత్రి, ఊట చిన్నబాబు, బంగారు లచ్చబాబు, పల్లి పెద్దబ్బాయి, బంగారు కూస రాజు, గవిరెడ్డి వీరబాబు, రుతుల అప్పల నాయుడు, ఉగ్గిన నానాజీ, దేశిక శివ, ఇళ్ల గోపాల్ రెడ్డి,నల్లబెల్లి అర్జున్, విసంశెట్టి రమణ మరియు అయిదు గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రంపచోడవరం లో 11 వ తేదిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలి: కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

పరిపాలనా కారణాల దృష్ట్యా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పోలవరం జిల్లా పర్యటనను అక్టోబర్ 11వ తేదీ ఆదివారానికి వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సమీక్షించేందుకు 2026 అక్టోబర్ 8వ తేదీన క్షేత్రస్థాయిలో నిర్వహించిన పరిశీలనలో పలు లోపాలు గుర్తించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పర్యటన వాయిదా వల్ల లభించిన అదనపు సమయాన్ని అధికారులు సద్వినియోగం చేసుకొని, గుర్తించిన లోపాలన్నింటినీ తక్షణమే సరిదిద్దాలని ఆదేశిం చా రు. పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పర్యటనలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి వేదికలు, రహదారులు, పారిశు ధ్యం, తాగునీటి సరఫ రా, విద్యుత్ సౌక ర్యాలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశా లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలి పారు. ప్రజలకు ఎలాం టి అసౌకర్యం కలగ కుండా అవసరమైన అన్ని ముందస్తు చర్య లు చేపట్టాలని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, ప్రతి శాఖ కు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి, ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.పర్యటన నిర్వహణకు సంబంధించి ఏర్పాట్ల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను సకాలంలో సమకూర్చుకోవాలని తెలిపారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటూ, నిర్దేశించిన సమయానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయ వంతం చేయడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని పేర్కొన్న జిల్లా కలెక్టర్, అందరూ సమిష్టిగా కృషి చేసి, పర్యటన సజావుగా జరిగేలా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు.



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించనున్న రాకోట గ్రామంలో రచ్చబండ వేదిక నిర్మాణము




## గంగవరం బాలికల పాఠశాల గేటు వద్ద మురుగు నీటి ముప్పు

❖ దోమల పెరుగుదలతో విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన ❖ శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రుల డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి గంగవరం:

పోలవరం జిల్లా గంగవరం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన గేటు పక్కనే మురుగు నీరు నిలిచిపోవడం చెత్త పేరుకుపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అపరిశుభ్ర వాతావరణంతో దోమలు పెరిగి విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు ఎప్పటి నుంచో ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు మండల కేంద్రంలో ఉన్న పాఠశాల వద్దే ఇలాంటి పరిస్థితి ఉంటే విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు.



**తల్లిదండ్రుల ప్రధాన డిమాండ్లు...** నిల్వ ఉన్న మురు గు నీటిని వెంటనే తొలగించాలి పేరుకుపోయిన చెత్తను పూర్తిగా శుభ్రం చేయాలి దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి మురుగు నీరు మళ్లీ నిల్వ ఉండ కుండా శాశ్వత డ్రైనేజీ నిర్మించాలి పాఠశాల పరిసరాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్య క్రమాలు నిర్వహించాలి విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధం

### నిరాశ్రయులైన బాధిత కుటుంబం.. ఆదుకోవాలని వేడుకోలు



ప్రజాభూమి దేవీపట్నం

పోలవరం జిల్లా దేవీపట్నం మండలం పాముగండి పంచాయతీ పరిధిలోని సీహెచ్ గంగవరం గ్రామంలో కారం అబ్బాయిదొరకు చెందిన ఇల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో బాధిత కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబం ఇబ్బందికర పరిస్థితిని ఎదు ర్కొంటోంది. కష్టపడి నిర్మించుకున్న ఇల్లు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుం బం ఆవేదనకు గురైంది. ఈ ఘటనతో కుటుంబానికి కలిగిన నష్టాన్ని గుర్తించి, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి నష్టం వివరాలను నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బాధిత కుటుం బానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందించి, తిరిగి కోలుకునేందుకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో పాఠశాలలో పౌష్టికాహారం



గొరగుమ్మి ఎంపీపీ పాఠశాలలో రసాయన రహిత కూరగాయల సాగు

ప్రజాభూమి ప్రతినిధి గంగవరం

పోలవరం జిల్లా గొరగుమ్మి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రోత్సా హంతో రసాయన రహితంగా ఆకుకూరలు కూరగాయలు దుంపలను సాగు చేస్తున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కలిసి పాఠశాల ఆవరణలో విత్తనాలు నాటి పంటలను సాగు చేస్తున్నారు ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ కే.వెంకన్న దొర మాట్లాడుతూ రసాయన ఎరువులు పురుగుమందులతో పండించిన కూరగాయలను వినియోగించడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు గతంలో అనుసరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ అధికా రుల సహకారంతో పాఠశాలలో రసాయనాలు లేకుండా కూరగాయలను పండిస్తున్నట్లు తెలిపారు పాఠశాలలో పండించిన ఆకుకూరలు కూరగాయలను విద్యార్థులకు వండి పెట్టడం ద్వారా వారికి తాజా పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు ఇటువంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి పాఠశాలలో ప్రోత్సహించి,విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించిన డీఎంఎంటీ నుకేష్ మరియు ఆయన సిబ్బందికి కే.వెంకన్న దొర కృతజ్ఞతలు తెలిపారు డి ఎం ఎం టి నుకేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు గ్రామస్తులు బాధ్యతగా ఈ విధంగా సహకరించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని ఇలాగ ప్రతి స్కూల్ నందు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సహకరిస్తే మా వంతు మేము ప్రతి పాఠశాల నందు ఏ విధంగా ఏటీఎం ప్లాన్ చేయాలో అవగాహన కల్పిస్తామని తన మాటల్లో తెలియపరిచారు ఈకార్యక్రమంలో హెడ్‌మాస్టర్ కే.వెంకన్న దొర ఉపాధ్యాయురాలు అచ్చియమ్మ,విద్యా కమిటీ చైర్మన్ లోతా వెంకటరమణ వైస్ చైర్మన్ కోసూరి సీతారామిరెడ్డి,పెసా కార్యదర్శి రాజారెడ్డి డీఎంఎంటీ నుకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిగ్నల్ కోసం రోజంతా గిరిజనుల అవస్థలు

### పంటల నమోదు నుంచి ప్రభుత్వ సేవల వరకు నెట్‌వర్క్ కష్టాలు



గంగవరం ప్రజాభూమి ప్రతినిధి

గిరిజన ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు ప్రజలకు శాపంగా మారాయి బీఎస్ఎన్ఎల్ జియో ఎయిర్‌టెల్ సేవలు సక్రమంగా అందకపోవడంతో అత్యవసర ఫోన్ కాల్స్ చేయడం నుంచి ప్రభుత్వ సేవలు పొందడం వరకు ఇబ్బందులు తప్పడం లేదు .

**ఓటీపీ కోసం గంటల తరబడి నిరీక్షణ..** పంటల నమోదు సమయంలో మొబైల్‌కు ఓటీపీలు రాక రైతులు వ్యవసాయ పనులు పక్కనపెట్టి సిగ్నల్ కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది దీంతో రోజువారీ కూలీ ఆదాయం కోల్పోవడమే కాకుం డా గడువులోగా పంటల నమోదు పూర్తవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

**సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు**

నెట్‌వర్క్ సమస్యలతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతుండటంతో ఒక్క పని కోసం రెండు మూడు రోజుల పాటు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు విద్యార్థుల ఆన్‌లైన్ సేవలు ప్రభుత్వ పథకాల దరఖాస్తులకూ ఆటంకాలు ఎదురవుతున్నాయి సిగ్నల్ లేకపోయినా నెలనెలా రీఛార్జ్‌ల భారం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అధికారులు స్పందించేనాగిరిజనుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత టెలికాం సంస్థలు నెట్‌వర్క్ సేవలను మెరుగుపరచాలని మారుమూల గ్రామాల్లోనూ నిరంతరాయంగా సిగ్నల్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధ్యాయులపై అదనపు పని భారం



❖ బోధనకు తగ్గుతున్న సమయం.. వంద శాతం ఉత్తీర్ణత ఎలా సాధ్యం? ❖ బోధనేతర విధులతో సతమతం.. విద్యార్థుల అభ్యసనంపై ప్రభావం పడే అవకాశం

ప్రజాభూమి అడ్డతీగల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరచాలని విద్యాశాఖ లక్ష్యాలు నిర్దేశిస్తోంది. విద్యా ర్థులందరూ మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచి స్తోంది. అయితే మరో వైపు బోధనతో పాటు వివిధ బోధనేతర విధు లు, నివేదికల తయారీ, సమాచార సేకరణ వంటి పనులు ఉపాధ్యాయులకు అదనపు భారంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధిం చేందుకు అవసరమైన సమయం ఎంతవరకు లభిస్తోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బోధన ఒకవై పు.. అదనపు పనులు మరోవైపు పాఠశా లలో ఉపా ధ్యాయుడి ప్రధాన బాధ్యత విద్యార్థుల కు పాఠాలు బోధించడం, వారు నేర్చుకున్న అంశాల ను అంచనా వేయడం, చదువులో వెనుకబడిన వారిని గుర్తిం చి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం. ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా వివరించడం, సందేహా లను నివృత్తి చేయడం, పరీక్షలకు సన్నద్ధం చేయడం వంటి పనులకు సమయం అవసరం. అయితే బోధనతో పాటు వివిధ విద్యా కార్యక్రమాలకు సంబంధించిన వివరాల సేకరణ, ప్రగతి నివేదికల తయారీ, ఇతర పరిపాలనా పనులను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి వస్తోంది. ఈ పనులన్నింటినీ సమన్వయం చేసుకోవడం ఉపాధ్యాయులకు సవాలుగా మారే పరిస్థితులు ఉన్నాయి.

**ఫలితాలపై లక్ష్యాలు.. సమయం మాత్రం కీలకం**

విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని, ముఖ్యంగా పదో తరగతి ఫలితాలు మెరుగుపడాలని ఆశించడం సమంజసమే. ఇందుకోసం విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పరిశీలించడం, వెనుకబడిన వారికి అదనపు బోధన అందించడం, పరీక్షలపై అవగాహన కల్పించ డం అవసరం. కానీ ఉపాధ్యాయులు బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటా యించాల్సి వస్తే, విద్యార్థులకు వ్యక్తిగతంగా సమయం కేటాయించడం కష్టమవుతుంది. ఫలితాలపై బాధ్యతను నిర్దేశించడంతో పాటు, ఆ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన పని వాతావరణాన్ని కల్పించడం కూడా అంతే ముఖ్యం.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఎప్పుడు?**

ప్రతి తరగతిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం ఒకేలా ఉండదు. కొందరు పాఠాలను త్వరగా అర్థం చేసుకుంటే, మరికొందరికి అదే అంశాన్ని పలుమార్లు వివరించాల్సి ఉంటుంది. ఇలాంటి విద్యార్థులను గుర్తించి అదనపు తరగతులు నిర్వహించడం, చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడం ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణతోనే సాధ్యమవుతుంది. ఈ క్రమంలో బోధనేతర పనుల భారం పెరిగితే, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సమయం కేటాయించడంపై ప్రభావం పడే అవకాశం ఉంది.బోధనకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలిప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయుల కృషి ఎంత ముఖ్యమో, వారికి అనుకూలమైన పని పరిస్థితులు కల్పించడం కూడా అంతే అవసరం. బోధనకు నేరుగా సంబంధం లేని పనులను సాధ్యమైనంతవరకు తగ్గించడం, అనవసరమైన సమాచార సేకరణను నివారించడం, పరిపాలనా పనులను సమర్థంగా నిర్వహించే విధానాలను అమలు చేయడం ద్వారా ఉపాధ్యాయులకు బోధన కోసం ఎక్కువ సమయం లభించే అవకాశం ఉంది.విద్యార్థుల ఫలితాలపై సమీక్షలు నిర్వహించడంతో పాటు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం కేవలం ఆదేశాలతోనే సాధ్యం కాదు. తరగతి గదిలో నాణ్యమైన బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, ఉపాధ్యాయులకు తగిన సమయం, అవసరమైన సహకారం అందినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగుపడతాయి.

## జనగణన 2027 రెండో దశను సమన్వయంతో విజయవంతం చేయాలి

### అమరావతి సదస్సు పాల్గొన్న లో పోలవరం జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

అమరావతి లోని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జనగణన–2027 జనాభా గణనపై రాష్ట్రస్థాయి ప్రధాన జనాభా గణన అధికారుల సదస్సులో పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ పాల్గొన్నారు. భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నోడల్ అధికారి శంషేర్ సింగ్ రావత్, జనగణన కార్యకలాపాల సంచాలకులు జె. నివాస్ తదితరులు జనగణన రెండో దశ నిర్వహణకు సంబంధించి కీలక సూచనలు చేశారు.జనగణనలో ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, నిర్ణీత గడువులో నాణ్యతతో ప్రక్రియను పూర్తి చేసేందుకు పక్కా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ, స్వీయ గణనపై విస్తృత ప్రచారం, రోజువారీ సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జనగణన–2027ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

# గుల్మార్గ్ లో రక్షణ శాఖ ఉన్నతాధికారుల సమావేశానికి ఎంపీ బాలశౌరి అధ్యక్షత









## మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి ఘన స్వాగతం

గుల్మార్గ్, కాశ్మీర్:

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి గుల్మార్గ్‌లో రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో పాటు డీఆర్‌డీఓ (DRDO), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (BDL), మిధాని (MID-HANI), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL) సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ఎంపీ బాలశౌరికి డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్‌తో పాటు బెల్, బీడీఎల్, మిధాని సంస్థల సీఎండీలు, హెచ్‌ఏఎల్ డైరెక్టర్ ఘన స్వాగతం పలికారు.రక్షణ రంగానికి సంబంధించిన ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, ప్రతినిధులతో నిర్వహించిన ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. రక్షణ రంగ సంస్థల కార్య కలాపాలు, సంబంధిత అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి.లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా ఎంపీ బాలశౌరి ఈ సమావేశానికి అధ్యక్షత వహించడం విశేషం.



## జనసేన పార్టీ 23వ డివిజన్ ఇన్‌చార్జిగా బచ్చుల దుర్గాప్రసాద్ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.జనసేన పార్టీ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో 23వ డివిజన్ ఇన్‌చార్జిగా బచ్చుల దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో, ఈరోజు బండి రామకృష్ణ స్వగృహంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చుల దుర్గాప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించి, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయడం పార్టీ కార్యకర్తల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు ప్రాధాన్యత నిస్తూ ముందుకు సాగాలని ఆ కాంక్షించారు. 23వ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను, ప్రజలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే నాయకత్వాన్ని అందించాలని సూచించారు. కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న బచ్చుల దుర్గాప్రసాద్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ ఆత్మీయ కలయిక పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను, పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించేలా సాగింది. ప్రజాసేవే లక్ష్యంగా, పార్టీ బలోపేతమే ధ్యేయంగా సమష్టి కృషితో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.



## వయోవృద్ధులకు సేవ చేయడం మాధవ సేవతో సమానం

### 75వ జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించిన వెచ్చా సత్యనారాయణమూర్తి

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :

వయోవృద్ధులకు సేవ చేయడం భగవంతుడికి సేవ చేయడంతో సమానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా, ఆపన్నులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మచిలీపట్నం ఈడేపల్లిలోని జెట్టి కృష్ణమూర్తి ప్రభుత్వ వృద్ధుల శరణాలయంలో విశ్రాంత ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వెచ్చా సత్యనారాయణమూర్తి తన 75వ జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు టవల్స్, స్నానపు సబ్బులు, బట్టల సబ్బులు, పండ్లు, స్వీట్లు, హాట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, 75 ఏళ్ల వయస్సులోనూ వెచ్చా సత్యనారాయణమూర్తి సమాజ సేవలో చురుకుగా పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. మచిలీపట్నంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ఫిజికల్ సైన్స్ బోధిస్తూ విద్యారంగానికి తనవంతు సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవాభావం సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ, వెచ్చా సత్యనారాయణమూర్తి మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ సమాజానికి తనవంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. తన జన్మదినాన్ని వయోవృద్ధుల మధ్య జరుపుకోవడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటారని అన్నారు.వెచ్చా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, వయోవృద్ధులు మన తల్లిదండ్రులతో సమానమని, వారికి ప్రేమతో అందించే సహాయం, సేవ భగవంతుడికి సమర్పించే సేవతో సమానమని అన్నారు. వృద్ధులను గౌరవించడం, ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హ్యూమానిటీ ఫౌండేషన్ నిర్వాహకురాలు నూర్జహాన్ బేగం, మరో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మూర్తి, వృద్ధాశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తమ మధ్యకు వచ్చి జన్మదిన వేడుకలను నిర్వహించి, బహుమతులు అందించిన వెచ్చా సత్యనారాయణ మూర్తికి వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.







## ఆర్టీసీ డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ

### ప్రయాణికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం: జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆర్టీసీ డ్రైవర్లు విధులు నిర్వహించాలని కృష్ణా జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు సూచించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.మచిలీపట్నంలోని ఏపీఎస్ఆర్టీసీ హెవీ వెహికల్ ట్రైనింగ్ కాలేజీ హాలులో శుక్రవారం కృష్ణా జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ, అద్దె, ఆన్‌కాల్ బస్సుల డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, డ్రైవర్లు వాహన వేగాన్ని నియంత్రణలో ఉంచుకోవాలని, రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. విధులకు హాజరయ్యే ముందు తగినంత నిద్ర, విశ్రాంతి తీసుకోవాలని, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకుండా పూర్తి ఏకాగ్రతతో వాహనాలు నడపాలని, ప్రయాణికులు, పాదచారుల కదలికలను నిరంతరం గమనిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులే ఆర్టీసీకి మూలధనమని, వారి పట్ల మర్యాదగా వ్యవహరించడం ప్రతి డ్రైవర్ బాధ్యతని తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ కె. హనుమంతరావు, గన్నవరం డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సురక్షిత డ్రైవింగ్ శిక్షకులు అబ్దుల్ భారీ, ఎన్.ఎస్.ఎన్. రాజు, ఆర్. మార్కండేయులు, కె. శ్రీనివాసరావు డ్రైవర్లకు సురక్షిత ప్రయాణం, రహదారి నియమాలపై శిక్షణ అందించారు.కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని డిపోలకు చెందిన ఆర్టీసీ, అద్దె, ఆన్‌కాల్ బస్సుల డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాదరహిత ప్రయాణాలను లక్ష్యంగా చేసుకుని, ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు దోహద పడతాయని అధికారులు పేర్కొన్నారు.

## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఉచిత కోచింగ్

### అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
### అక్టోబర్ 20 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలి

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కృష్ణా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి జి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు.దరఖాస్తు చేసుకునే విధానంఅర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తదితర పత్రాల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జతపరచాలి.పూర్తి చేసిన దరఖాస్తులను 2026 అక్టోబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో నేరుగా సమర్పించాలి. దరఖాస్తు ఫారాలను మచిలీపట్నంలోని కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో ఉన్న సంబంధిత జిల్లా కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చని అధికారులు తెలిపారు.స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపికఅభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత బస, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.సివిల్ సర్వీసెస్‌లో ప్రవేశించి ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జి. రమేష్ సూచించారు.మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు- సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, అవనిగడ్డ: 6301869360- సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి: 9533400378- సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి: 9491751693- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, సీనియర్ అసిస్టెంట్: 9154769111చిరునామా: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయ సముదాయం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.ముఖ్య గమనిక: అభ్యర్థుల ఎంపిక స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా జరుగుతుంది. దరఖాస్తుల సమర్పణకు చివరి గడువు అక్టోబర్ 20, 2026, సాయంత్రం 5 గంటలు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష




### రూ.5 వేల జరిమానా.. చెల్లించకపోతే మరో మూడు నెలలు అదనపు శిక్ష
### కోర్టు మానిటరింగ్‌తో కేసుల విచారణలో పురోగతి

ప్రజాభూమి రాజవొమ్మంగి

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి కాకినాడ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతోపాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని, చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించింది. బాధితురాలికి నష్టపరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది.రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన ఈ కేసులో కాకినాడ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె. శ్రీదేవి తీర్పు వెలువరించారు. 2020 లో నమోదైన కేసుపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 అక్టోబరు 18న చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై జడ్డంగి చైతన్యనగర్‌కు చెందిన తెడ్ల శ్రీను అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి జడ్డంగి ఎస్సై ఎం. మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రాఫిక్ డీఎస్పీ బి. రామకృష్ణ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.కేసు దర్యాప్తును పూర్తిచేసిన పోలీసులు ఐదు రోజుల్లోనే న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోక్సో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంకె శ్రీదేవి ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. కోర్టు మానిటరింగ్‌తో విచారణపై పర్యవేక్షణమహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ప్రతి కోర్టుకు ప్రత్యేక కానిస్టేబుల్‌ను నియమించడంతోపాటు, జిల్లా స్థాయిలో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కోర్టు లైజనింగ్ సెల్ ఏర్పాటు చేసి కేసుల విచారణ పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంకె శ్రీదేవి, దర్యాప్తు అధికారి బి. రామకృష్ణ, రంపచోడవరం ఎస్‌డీపీఓ అశ్రఫ్ అలీ, రాజవొమ్మంగి సీఐ ఎన్. సన్యాసినాయుడు, కోర్టు మానిటరింగ్ సీఐ ఎం. ముక్తేశ్వరరావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ కోటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నేరాల నియంత్రణకు చర్యలు కొనసాగిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలి!

### పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దిశానిర్దేశం
### గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

ప్రజా భూమి రంపచోడవరం



రానున్న స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఇటీవల గుర్తేడు, పాతకోట, బొడ్డగండి, కానివాడ పంచాయతీల పరిధిలో పర్యటించిన ఆమె, ఆయా ప్రాంతాల్లో కార్యకర్తలతో మాట్లాడి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎన్నికల సమయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసేలా ఇప్పటి నుంచే కార్యాచరణకు సిద్ధం కావాలని ఆమె దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఒంటెద్దు పోకడలతో పార్టీకి తీవ్ర నష్టం!

### కార్యకర్తలను కలుపుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తగవు
### సమిష్టి నాయకత్వంతోనే పార్టీ బలోపేతం తుర్రం జగదీష్ దొర

ప్రజాభూమి దేవీపట్నం



రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో కార్యకర్తలను, స్థానిక నాయ కులను సమన్వయం చేసుకోకుండా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని దేవీపట్నం మాజీ ఎంపీటీసీ, మండల యువజన విభాగం అధ్యక్షుడు తుర్రం జగదీష్ దొర ఆరోపించారు. ఇలాంటి ఒంటెద్దు పోకడల వల్ల పార్టీకి క్షేత్రస్థాయిలో నష్టం జరిగే ప్రమాదం ఉంద ని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జగదీష్ దొర విమర్శించారు. మండల స్థాయి సమావేశాలు నిర్వ హించే సమయంలోనూ సంబంధిత నాయకులు, కార్యకర్తలతో ముందస్తుగా చర్చించకుండా నిర్ణ యాలు తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. పార్టీని బలోపేతం చేయాల్సిన తరుణంలో అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని పేర్కొన్నారు.నాయకత్వం అంటే కొంతమందితో మాత్రమే సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకోవడం కాదని, ప్రతి మండ లంలోని నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు విలువ ఇవ్వడమని ఆయన అన్నారు. స్థానిక పరిస్థితులను, కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తే పార్టీకి నష్టం తప్పదని హెచ్చరించారు.ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరిస్తే పార్టీ ఎలా బలోపేతం అవుతుందని ఆయన ప్రశ్నించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేయాలంటే కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని సూచించారు.రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే వ్యక్తిగత ఆధిపత్య ధోరణులను పక్కనపెట్టి సమిష్టి నాయకత్వంతో ముందుకు సాగాలని జగదీష్ దొర డిమాండ్ చేశారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచి, అందరినీ కలుపుకొని పనిచేసినప్పుడే పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు.

## ఐడి కార్డుల పంపిణీ

### మంగళాపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ పదవులు, ఐడి కార్డు ఇచ్చి వారిని గౌరవించాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం అవనిగడ్డ నియోజకవర్గం, చల్లపల్లి మండలం, మంగళాపురం గ్రామంలో మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆదేశానుసారం పార్టీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేసి వారికి ఐడి కార్డులు అందజేశారు, పార్టీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, పార్టీలోని ప్రతి కార్యకర్తకి అన్ని విధాల అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీల విభాగం అధ్యక్షులు మద్ది వెంకటనారా యణ(చిన్న), గరికపాటి వెంకట కృష్ణారావు, చల్లపల్లి మండల కన్వీనర్ సేలం సత్యనారాయణ(నాని) జిల్లా వికాంగులు అధ్యక్షులు కొల్లూరు శామ్యూల్ మండల మహిళా కన్వీనర్ బందలపాటి లక్ష్మి గ్రామ కన్వీనర్ చంద్ర చిన్ని బాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామంలో సీనియర్ నాయకులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

# ఇందుపల్లి-గరువు రోడ్డు నాణ్యతపై విచారణ జరపాలి

- మూడు నెలలకే దెబ్బతిన్న రూ.3.20 కోట్ల రోడ్డుపై సమగ్ర విచారణకు డిమాండ్.
- వ్యక్తిగత విమర్శలు కాకుండా ఆరోపణలకు సమాధానం చెప్పాలి: చిర్ల జగ్గిరెడ్డి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు చోటుచేసుకుంటే ప్రతిపక్షంగా ప్రశ్నించడం తమ బాధ్యత అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని ఇందుపల్లి-గరువు రహదారిని సుమారు రూ.3.20 కోట్ల వ్యయంతో నిర్మించగా, మూడు నెలలకే రోడ్డు దెబ్బతిన్నదని చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు రహదారి వద్దకు వెళ్లి నాణ్యతా లోపాలను ప్రజల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యతా లోపాలు లేవని చెప్పే ధైర్యం ఉంటే సంబంధిత రికార్డులు, నిర్మాణ నాణ్యతా నివేదికలు, వ్యయ వివరాలను ప్రజల ముందుంచాలని బండారు సత్యానందరావును కోరారు. రోడ్డు నిర్మాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు నాణ్యతతో జరగాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. రహదారి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించారా, లేక కొంతమంది వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితమైందా అన్న అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. రోడ్డు నాణ్యతపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని జగ్గిరెడ్డి అన్నారు. అవినీతి ఆరోపణలకు వ్యక్తిగత విమర్శలు సమాధానం కావని, ప్రభుత్వ నిధుల వినియోగం, కాంట్రాక్టుల కేటాయింపు, పనుల నాణ్యతపై పారదర్శకంగా వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**మద్యం ధరలపై సమాధానం చెప్పాలి**

మద్యం ధరల విషయంలోనూ ప్రజలపై అదనపు భారం పడుతోందని జగ్గిరెడ్డి ఆరోపించారు. ఎంఆర్‌పీ ధరలకు మించి వసూళ్లు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. మద్యం వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన వారికి నష్టాలు, మరెవరికో లాభాలు అన్న ఆరోపణలపై కూడా సమాధానం చెప్పాలని అన్నారు. రైతులకు సాగునీరు, యూరియా అందుబాటు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

**ఆత్రేయపురం పీహెచ్‌సీ భవనంపై వివరణ**

ఆత్రేయపురం పీహెచ్‌సీ భవనం విషయంలో తనపై వస్తున్న విమర్శలకు కూడా చిర్ల జగ్గిరెడ్డి స్పందించారు. భవన నిర్మాణానికి సుమారు రూ.17.50 లక్షలు మంజూరయ్యాయని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక దళిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడంతో ప్రారంభోత్సవం నిర్వహించిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.3.50 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించారని, మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తికాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా పనులు పూర్తికాలేదని విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ఎవరు చేపట్టినా స్వాగతిస్తామని అన్నారు. అయితే నాసిరకం పనులు జరిగితే మాత్రం ప్రజల తరఫున ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఉనికి లేదని, ప్రతిపక్షం బలహీనపడిందని చెప్పేవారికి స్థానిక ఎన్నికలే సమాధానం చెబుతాయని జగ్గిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని వ్యక్తిగత విమర్శలు, ఒత్తిళ్లతో అణచివేయలేరని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బండారు సత్యానందరావు వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి ఇందుపల్లి-గరువు రోడ్డు నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణకు సహకరించాలని, ప్రజాధనానికి జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రజాక్షేత్రంలో బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి

**స్థానిక సంస్థల్లో పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న నారా లోకేష్ ప్రకటనను స్వాగతించిన టీడీపీ నాయకులు.**



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటనను టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న టీడీపీ చిత్తశుద్ధికి ఈ నిర్ణయం నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గుత్తుల పట్టాభి రామారావు, రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్ మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం న్యాయపరంగా పోరాటం చేసిందన్నారు.

**వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తగ్గాయి**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తగిన ప్రాధాన్యం లభించలేదని వారు విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల విషయంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గిపోయాయని ఆరోపించారు. 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయడంలో కూడా అప్పటి ప్రభుత్వం చొరవ చూపలేదని పేర్కొన్నారు.

**34 శాతం కోసం కూటమి ప్రభుత్వం పోరాటం**

34 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం న్యాయపరంగా పోరాటం చేసిందని నాయకులు తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవోను హైకోర్టు కొట్టివేసిన అనంతరం కూడా బీసీల ప్రయోజనాల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం కొనసాగించిందన్నారు. రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించరాదన్న న్యాయపరమైన పరిమితుల నేపథ్యంలో.. పార్టీ పరంగా అదనంగా 10 శాతం ప్రాతినిధ్యం కల్పించి, బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం దక్కేలా ఎన్నికలు నిర్వహిస్తామని నారా లోకేష్ ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమని వారు పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా టీడీపీ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ వర్గాల అభ్యున్నతికి దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం

**ధర్మవరంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా**



ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఆమె, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా తెలిపారు.

## వెలిచేరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం మండలం వెలిచేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత విద్యార్థులతో మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కేరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గుమ్మడి శ్రీకాంత్ వర్మ విద్యార్థులకు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మనసులోని భావాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి అవసరమైన మద్దతు పొందాలని సూచించారు. మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వామి శేఖర్, ఉపాధ్యాయులు కమలాకర్, కేరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గుమ్మడి శ్రీకాంత్ వర్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

**రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా**





ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పాల్గొని రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రాన్ని ముద్రించడంపై విమర్శలు వచ్చాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజకీయ నాయకుల చిత్రాలకు బదులుగా ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాలను అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు కొత్త పాస్ పుస్తకాల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. రైతుల హక్కులకు, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పార్లమెంటు ఎన్నికల నిర్వహాక దళ్ సభ్యులు నియామకం

**రామచంద్రపురం నుండి ఐదుగురు జనసైనికులకు స్థానం.**



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం ప్రకటించిన జనసేన పార్టీ అమలాపురం పార్లమెంటు ఎన్నికల నిర్వహాక దళ్ కమిటీ సభ్యులు 32 మందిలో రామచంద్రపురం నియోజవర్గం నుండి ఐదుగురు జనసైనికులకు స్థానం దక్కింది . వీరిలో దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన కాజులూరు మండల డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మెన్ గా పనిచేస్తున్న సీనియర్ జనసేన యువ నాయకుడు లకాని కృష్ణ చైతన్య, రామచంద్రపురం పట్టణానికి చెందిన న్యాయవాది పలివెల సత్యనారాయణ , పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కలిదిండి సూర్యనారాయణ (సూరిబాబు) శనివారపు రాంబాబు నాయుడు , ద్రాక్షారామం గ్రామానికి చెందిన సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్,లను రామచంద్రపురం నియోజకవర్గం నుండి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జనసేన పార్టీ తమపై ఉంచిన బాధ్యతను సక్రమంగా సమిష్టి కృషితో నిర్వహిస్తామని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు . రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిపార్టీకి చెందిన అభ్యర్థుల విజయానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. ప్రస్తుతం జరగబోయే స్థానిక ఎన్నికల్లో తమ శక్తి సామర్థ్యాలు మేరకు జనసేన పార్టీ విజయానికి అందరితో కలిసి పని చేస్తామని అన్నారు. జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం,మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి,రామచంద్రపురం నియోజవర్గం ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ,జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,వీర మహిళలకు ఈసందర్భంగా వీరు కృతజ్ఞతలు తెలియజేసారు. సమర్థవంతులకే స్థానం దక్కింది: ఇన్చార్జి చంద్రశేఖర్. అమలాపురం పార్లమెంటు ఎన్నికల నిర్వహాక దళ్ కమిటీ సభ్యులుగా రామచంద్రపురం నియోజకవర్గం నుండి ఐదుగురు సభ్యులను పార్టీ అధిష్టానం నియమించడంతో రామచంద్రపురం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ స్పందిస్తూ ప్రస్తుతం కమిటీ సభ్యుల్లో స్థానం దక్కిన వారందరూ సీనియర్ జనసేనకు లేనని మొదటి నుండి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పనిచేస్తూ తమ వంతు పాత్ర నిర్వహించారని ముఖ్యంగా ఐదుగురు సమర్థులకే ఈ పదవులు దేక్కాయని చంద్రశేఖర్ సందర్భంగా స్పష్టం చేశారు. వీరందరికీ ఆయన సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

## మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం




పాలకొల్లు

ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ శాఖ మరియు ఈగల్ టీం సంయుక్తం గా చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, పోడూరు మండలం జిన్నూరు పీఎం శ్రీ ఏ ఎస్ ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ నందు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పాలకొల్లు ప్రొహిబిషన్ ఎ ఎక్సైజ్ స్టేషన్ మరియు ఈగల్ టీం సంయుక్తం గా నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్ పి. మహేష్ ,జి రఘు మరియు స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయం గమనించినట్లయితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు తోపాటుగా పాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్ శివ జ్యోతి గారు,జిల్లా నార్కోటిక్స్ ఈగల్ సెల్ ప్రతినిధి కె. మురళి,ఓం శాంతి సంస్థ పాలకొల్లు ప్రతినిధి శ్రీమతి సుజాత,పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ర్యాలీ పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ శాఖ అధికారులు, మాట్లాడుతూ,డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన, ఉజ్వలమైన భవిష్యత్తు సాధ్యమవుతుంది. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలిఅని పిలుపునిచ్చారు.

## అసంక్రమిత వ్యాధుల నివారణకు క్రమం తప్పని పరీక్షలు అవసరం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ప్రధానమంత్రి జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఈదర ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల పరిధిలోని రాజవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ సాయి సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు అసంక్రమిత వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, వ్యాధులను తొలిదశలో గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో 56 మందికి ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌యూఓ ఎల్లమంద, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## సనాతన ధర్మం, వేద సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న జగద్గురు శంకరాచార్య స్వామీజీ.**



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పూరీ గోవర్ధన పీఠానికి చెందిన జగద్గురు శంకరాచార్య ఆద్యోక్షజానంద స్వామీజీ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన జగద్గురు శంకరాచార్య స్వామీజీకి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామీజీకి ఆశీర్వచనం అందించి, స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ, వేద సంస్కృతి పరిరక్షణ, గోసంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమాజంలో ధార్మిక విలువలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, వేద సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయులు మెహర్ జనసేనలో చేరిక.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యధి క ఓటర్లను ప్రభావితం చేయగలిగిన విశ్రాం త ఉపాధ్యాయుడు మెహర్ శుక్రవారం సాయంత్రం రామచంద్రపురం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలు ఆయన పరిపాలన విధానం ఆయన సేవాభావం, నిరాడంబరతకి ఆకర్షితుడై, పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమం త్రిగా చూడాలని ఆకాంక్షతో జనసేన పార్టీలో చేరి నట్లు పేర్కొన్నారు .ఆయనకు వెన్నుదన్నుగా నిలవాలని రామచంద్రపురం జనసేన పట్టణ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సమక్షంలో జనసేన పార్టీ ఆఫీసునందు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు గొల్లపల్లి కృష్ణ , కొండ్రెడ్డి శ్రీనివాసరావు,కలిదిండి సూరిబాబు, నంబుల నాగు, పడాల లోవరాజు , పోలిశెట్టి పెదబాబు,పోలిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 10 అక్టోబరు 2026


## ఐదు గంటల పాటు విద్యుత్ నిలిపివేత

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో అత్యవసర మరమ్మతులు, నెలవారీ నిర్వహణ పనుల కారణంగా శనివారం (అక్టోబరు 10) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సహాయ కార్యనిర్వాహక ఇంజినీరు నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని, పనులు పూర్తయిన వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

## కోకో ప్లాంటేషన్ పనులను పరిశీలించిన పథక సంచాలకులు



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన కోకో ప్లాంటేషన్ పనులను విబిజి -రామ్ జి పథక సంచాలకులు జి.ఎస్. రామ్ గోపాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కోకో మొక్కల ఎదుగుదల, వాటి పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, నీటి యాజమాన్య పద్ధతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తూ ప్లాంటేషన్‌ను విజయవంతంగా అభివృద్ధి చేయాలని అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్లాంటేషన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తూ, మొక్కల సంరక్షణలో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం ప్లాంటేషన్‌ను పర్యవేక్షిస్తూ, పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నవీకరించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పథక సంచాలకులు రామ్ గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో విబిజి -రామ్ జి అదనపు కార్యక్రమాధికారి చ. విజయరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వి. సుబ్రమణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## బలహీనవర్గాలపై వైసీపీ కక్ష కట్టింది

**బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి**

**రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి**



ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

బలహీనవర్గాల ప్రయోజనాలకు వైసీపీ ప్రభుత్వం నష్టం కలిగించిందని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో గత ప్రభుత్వాల నిర్ణయాలను ప్రస్తావిస్తూ, రిజర్వేషన్ల తగ్గింపుపై వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వనపర్తి బద్రి మాట్లాడుతూ, 1985లో ఎన్టీ రామారావు తొలిసారిగా బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని తెలిపారు. అయితే, జగన్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించారో వైసీపీ నాయకులు ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు.బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీల హక్కులు, రిజర్వేషన్ల అంశంపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, మదినే దొరబాబు, వనపర్తి సతీష్, చిలకమర్తి భద్రం, బొబ్బర ప్రసాద్, యడ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాష్ .



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు చేపట్టడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి 48 అర్జీలు అందగా, వాటిని మంత్రి స్వయంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి సుభాష్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తిగత, సామాజిక, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించే వేదికగా ప్రజా దర్బార్ నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

# హసన్ బాధలో సైబర్ భద్రతపై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

మోదీ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలలో భాగంగా డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్ బాద జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధోనోపాధ్యాయురాలు సుందరి ఆద్వర్యంలో సైబర్ భద్రతపై అవగాహన అదేవిధంగా యువత కోసం ప్రేరణాత్మక సమావేశ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ నాగిరెడ్డి సతీష్ రావు



మండల బిజెపి అధ్యక్షులు,ఆత్మ సభ్యులు ఆకేటి శ్రీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హసన్ బాద మహిళా పోలీసు లలితా విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అనూష యువత కోసం ప్రేరణాత్మక సందేశాన్నీ అందించారు.సతీష్ రావు మాట్లాడుతూ అందరూ సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.యువత కొత్త అలోచనలు,లక్ష్యం పట్ల పట్టుదల,సాధన పట్ల అంకిత భావం కలిగి ఉండాలని,వికసిత్ భారత్ లక్ష్యంలో యువత పాత్ర ప్రధానమైందని,యువత వారి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొని స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని,యువత సమాజ సేవలో పాల్గొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి విజయమే లక్ష్యంగా బీజేపీ అభ్యర్థులు సిద్ధం కావాలి

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేసేందుకు బిజెపి శ్రేణులు సిద్ధంగా కావాలని బిజెపి సీనియర్ నాయకులు కర్రి చిట్టిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు దునే శ్రీనివాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ సలాది శేఖర్, అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి శ్రీను, మాధవభట్ల కృష్ణమూర్తి, యంఁడ్ర బుల్లబ్బులు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.సీనియర్ నాయకులు కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి



విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ తరపున తెలియజేస్తున్నాము అని,కూటమి పొత్తుల్లో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించే స్థానాల్లో పార్టీ తరఫున సమర్థులైన, ప్రజలకు అందుబాటులో ఉండే నిబద్ధత కలిగిన కార్యకర్తలను అభ్యర్థులుగా ఎంపిక చేసి ఎన్నికల బరిలో నిలిపేందుకు పార్టీ సిద్ధంగా ఉంది తెలియజేశారు.కూటమి ధర్మాన్ని గౌరవిస్తూ, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతూ, కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేస్తారని తెలియజేస్తున్నాము. పార్టీకి కేటాయించిన స్థానాల్లో తగిన అభ్యర్థులను ఎంపిక చేసి, ప్రజల మద్దతుతో విజయాన్ని సాధించడమే మా ప్రధాన లక్ష్యం అని చెప్పారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని స్థానిక స్థాయిలోనూ బలోపేతం చేసే దిశగా భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుంది అని తెలియజేశారు కూటమి ఐక్యతే మా బలం... కూటమి అభ్యర్థుల విజయమే మా లక్ష్యం గా బీజేపీ ముందుకు సాగుతోంది అని తెలియజేశారు .

# శోభనాద్రి వేద పాఠశాలలో వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

**వేదమంత్ర ఘోషలు, చండీ పారాయణాలు, హోమాలతో ఆధ్యాత్మిక శోభ**

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాద్రి లక్ష్మీ నృసింహ స్వామి వేద శాస్త్ర పాఠశాలలో శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవాలను వేద సంప్రదాయానుసారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు పాఠశాల కార్యదర్శి తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 18వ తేదీ దుర్గాష్టమి వరకు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సప్తశతీ పారాయణం, చండీ మూలమంత్ర జపం, ఏకాదశ రుద్రాభిషేకం, చండీ సప్తశతీ హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి తదితర వైదిక



క్రతువులు నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రదోషకాలంలో అమ్మవారికి విశేషార్చన, వేద పారాయణం, సహస్రనామార్చన, దర్బారు అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం దేవతా హోమాలు, సువర్ణ వాహన సేవ, మహాపూర్ణాహుతి, అవభృథ స్నానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఆగిరిపల్లి పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమం జరగనుంది. వేదమంత్రాల పఠనం, యాగహోమాలు, విశేష పూజలతో ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకోనున్న ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని కార్యదర్శి కోరారు.

## వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

**స్థానిక ఎన్నికల్లో ప్రతి పంచాయతీని గెలిపించడమే లక్ష్యం.**



ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని కుందులూరు, ములకపల్లి గ్రామపంచాయతీలలో శుక్రవారం మండల వైస్ ప్రెసిడెంట్ బంధం రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహించారు. గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మండల కన్వీనర్ పోడియం గోపాల్‌రావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త తమ పంచాయతీని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. కుందులూరు, ములకపల్లి పంచాయతీల్లో కార్యకర్తల అభిప్రాయాలను నాయకులు సేకరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి విభేదాలు, సమస్యలు తలెత్తకుండా కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థులను గ్రామ కార్యకర్తల అభిప్రాయాలు, వారి ఇష్టపూర్వక నిర్ణయాలకు ప్రాధాన్యతనిస్తూ ఎంపిక చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పిట్ట రామారావు, కోటం జయరాజ్, ముత్యాల గౌతం, మడకం కన్నారావు, సోడి చిరంజీవి, కాసు లక్ష్మణ్, మాడే ముత్యాలరావు, చిచ్చడి రామారావు, గుజ్జ రాజేశ్వరి, బీరుబోయిన మహేష్, తెల్లం తమ్మయ్య, కుంజ దూలయ్య, కడుపు నాగేంద్ర, పండ బుచ్చిరాజు, మడకం శంకర్, తెల్లం వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తలకు ఘన సన్మానం

- ఆరోగ్య సంరక్షణలో ఆశా సేవలు అభినందనీయం
- సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా విఆర్ పురంలో కార్యక్రమం.

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం విఆర్.పురం మండలం పెద్దమట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆశా కార్యకర్తలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ, వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కొనియాడారు. గ్రామాల్లో వ్యాధిగ్రస్త కుటుంబాలను గుర్తించి వారిని వైద్యశాలలకు తరలించడం, పోషకాహార విలువలపై అవగాహన కల్పించడం, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికలకు ఆరోగ్య సూచనలు అందించడం వంటి సేవలను ఆశా కార్యకర్తలు నిరంతరం అందిస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పోషణ్ అభియాన్, మిషన్ ఇంద్రధనస్సు, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్, ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో ఆశా కార్యకర్తల సేవలు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ ఆశా కార్యకర్తలు వైద్య బృందాలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలందించారని, కోవిడ్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వారి పాత్ర మరువలేనిదని నాయకులు అన్నారు. 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా



ఆరోగ్య సంరక్షణ అందించడంతో పాటు, మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలను గౌరవించడం తమ బాధ్యతగా భావించి ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా వైస్ ప్రెసిడెంట్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు రామారావు, యువ మోర్చా నాయకుడు గేద శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా నాయకుడు సన్యాసి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. నరేంద్ర మోదీ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఆరోగ్య రంగంలో చేపట్టిన కార్యక్రమాలను గుర్తిస్తూ పార్టీలకు అతీతంగా పలువురు ముఖ్య నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

# అమ్మవారి సేవలో అంకితభావం.. విధుల్లో భక్తిభావం వెల్లివిరియాలి

- అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ దిశానిర్దేశం
- సెక్టార్ల వారీగా సమన్వయ శాఖల అధికారులకు విధుల కేటాయింపు
- పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వీఎంసీ ధ్యానచంద్ర

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా మహోత్సవాల సందర్భంగా అధికారులు, సిబ్బంది "జై భవానీ" నినాదంతో భక్తిశ్రద్ధలు, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. అమ్మవారి సేవలో పాల్గొనడం ఒక పవిత్రమైన అవకాశంగా భావిస్తూ దూరప్రాంతాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవాభావంతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నగరంలోని డా. బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, ఆలయ ఈవో వీకే శీనా నాయక్, అడిషనల్ సీపీ కేజీవీ సరిత, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు దసరా విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గత సంవత్సరం 20 లక్షల మంది వరకు భక్తులు వచ్చారని ఈసారి 25 లక్షల వరకు భక్తులు రావచ్చని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. దసరా మహోత్సవాల విధుల్లో నియమితులైన సెక్టార్ ఇన్‌చార్జ్ అధికారులు, ఇతర సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలను ముందుగానే సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, విధుల మార్పిడి సమయంలో ముందుగానే హాజరై బాధ్యతలు స్వీకరించాలన్నారు. ప్రతి సెక్టార్‌లోని కీలక ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళికలు, భద్రత ఏర్పాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో ఉన్న అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెంటనే చేరవేయాలని తెలిపారు. సామాన్య భక్తులకు ఎక్కడైనా అసౌకర్యం





కలిగితే తక్షణమే స్పందించి పరిష్కరించాలని, వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్, నిర్మాణాల భద్రత, తాగునీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ, భక్తుల రాకపోకలకు సురక్షిత మార్గాలు, లైటింగ్, సూచిక బోర్డులు, సమాచార బోర్డులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా భక్తులు గుమిగూడితే కారణాన్ని వెంటనే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారుల వల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసుల సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని, రహదారుల కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. భక్తులతో నిరంతరం మమేకమవుతూ ఆన్‌లైన్ సమాచార, అభిప్రాయ సేకరణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని, ఏవైనా ప్రత్యేక సహాయ సహకారాలు అవసరమైతే జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ దసరా మహోత్సవాల్లో సామాన్య భక్తుల సంతృప్తి, భద్రతే అత్యున్నత ప్రాధాన్యమని, ప్రతి భక్తునికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే తమ కర్తవ్యమని, పని దైవంతో సమానం అనే స్ఫూర్తితో అంకితభావంతో విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. సమావేశంలో సెక్టార్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల దశ ఎంతో కీలకం

## -క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి -సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథరెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్
విద్యార్థుల జీవితంలో కళాశాల దశ ఎంతో కీలకమని, ఈ దశను సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ల శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, సమయపాలనను అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. శుక్రవారం హిందూపురంలోని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికిన సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సంవత్సరం నూతనంగా కళాశాలలో చేరే విద్యార్థులకు స్వాగతం పలకడం ఒక మంచి సంప్రదాయమనిత శ్రీనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడటంతో పాటు, నూతన



విద్యార్థుల్లో కళాశాల పట్ల ఆత్మీయత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ, అధ్యాపకుల సూచనలు పాటించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని, చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు. విద్యార్థుల విజయమే కళాశాల ప్రతిష్ఠను మరింతబ పెంచుతుందని పేర్కొన్నారు. కళాశాల ఏవో గంగిరెడ్డి మాట్లాడుతూ, సప్తగిరి కళాశాలపై నమ్మకంతో తమ పిల్లలను చేర్పించిన నూతన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించడంతో పాటు, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు, యాజమాన్యం నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు తక్కువ సమయంలోనే స్వాగత కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సీనియర్లు నూతన విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి, వారి విద్యాభ్యాసానికి సహకరించాలని సూచించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుమంత్ రెడ్డి మాట్లాడుతూ, నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు స్వాగత వేడుకను ఆనందంగా ఆస్వాదించాలని, అదే ఉత్సాహాన్ని చదువులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. జూనియర్ కళాశాల డీన్ ప్రకాష్ రెడ్డి నూతన విద్యార్థులకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. సీనియర్ విద్యార్థినీ విద్యార్థులు ప్రత్యేక ఏర్పాట్లతో నిర్వహించిన ఈ స్వాగత కార్యక్రమంలో నూతన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పర పరిచయాలు, ఆత్మీయ పలకరింపులు, విద్యార్థుల కేరింతలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బహుజనులను మేల్కొలిపిన సామాజిక వేత్త కాన్షీరాం

## -బీసీలకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాభూమి, హిందూపురం టౌన్
బహుజనులను చైతన్యవంతులను చేసి, వారికి రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాట మార్గాన్ని చూపిన మహనీయుడు మాన్యవర్ కాన్షీరాం అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు పేర్కొన్నారు. బీసీల సమస్యల పరిష్కారం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పోరాడే పార్టీ బీఎస్పీ మాత్రమేనని పేర్కొన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం 20వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఆబాద్‌పేట బీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. నియోజకవర్గ బీఎస్పీ ఉపాధ్యక్షుడు జమ్మిమాను మౌలాలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరాములు పాల్గొని కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని బీసీల సమస్యలు



పరిష్కారం కావాలంటే వారికి రాజకీయ, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల సాధన, బహుజనుల రాజ్యాధికార లక్ష్యంతోనే కాన్షీరాం బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. అయితే బీసీలను మభ్యపెడుతూ మనువాద భావజాలం కలిగిన పార్టీలు అధికారాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. బీసీల జనాభా, వారి సామాజిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే కులగణన అంశం ఇప్పటికీ తేలకపోవడం వెనుక పాలకుల నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని శ్రీరాములు విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశానికి సంబంధించి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో నిలవకపోవడం బీసీలకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. బీసీల పట్ల కపట ప్రేమ చూపించడం కాకుండా, వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీఎస్పీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కాన్షీరాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బహుజనుల ఐక్యతను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పెన్నయ్య, సీనియర్ నాయకులు ఎస్.ఆర్.పల్లి శ్రీనివాసులు, గంగాధరప్ప, కొట్నూరు గంగప్ప, స్టూడియో గంగాధర్, హసేన్ భాయ్, రవికుమార్, వెంకటేశులు, వెంకటరమణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# సమాజానికి ఆదర్శం...! -రక్తదానానికి ముందుకొచ్చిన విద్యార్థినులు..

## -మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదాన శిబిరంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. కృష్ణమూర్తి నాయుడు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
రక్తదానం అంటే ప్రాణదానం.. ఆపదలో ఉన్న ఓ మనిషికి ప్రాణం పోయడమే కాకుండా, ఓ కుటుంబంలో వెలుగులు నింపే మహత్తర సేవ. ముఖ్యంగా మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. సేవాభావం, సామాజిక బాధ్యతలో యువతులు ఎక్కడా వెనుకబడరని నిరూపిస్తూ విద్యార్థినులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త కోనేటి స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. కృష్ణమూర్తి నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అర్హత కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ, రక్తదానం అత్యంత విలువైన మానవీయ సేవ అని పేర్కొన్నారు. అమ్మ జన్మనిస్తే, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో రక్తం కీలక



పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో ముఖ్యమన్నారు. రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అపోహలకు తావివ్వకుండా వైద్యుల సూచనల మేరకు అర్హులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో విద్యార్థినులు రక్తదానానికి ఆసక్తి చూపుతూ ముందుకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణంగా రక్తదానం విషయంలో యువతలో అనేక అపోహలు, సందేహాలు కనిపిస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థినులు సామాజిక బాధ్యతను గుర్తించి రక్తదాన కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, క్రీడలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారనే విషయానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవడం ద్వారా సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని, రక్తదానం వంటి కార్యక్రమాల్లో యువతులు భాగస్వాములు కావడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అయితే రక్తదానం చేయడం వైద్యపరంగా అర్హత ఉన్నవారికే సాధ్యమని, ప్రతి ఒక్కరూ ముందుగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు రక్తదానం చేయాలని సూచించారు. హిందూపురం రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. రక్తదానం చేస్తే శరీరంలో బలహీనత వస్తుందనే అపోహాలు చాలామందిలో ఉన్నాయని, సరైన వైద్యపరీక్షలు నిర్వహించి అర్హత కలిగిన ఆరోగ్యవంతుల నుంచి రక్తాన్ని సేకరించడం సురక్షితమైన విధానమని తెలిపారు. రక్తదానానికి సంబంధించిన శాస్త్రీయ అంశాలను వివరించి, యువతలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల్లో రక్తదానం పట్ల ఉన్న అవగాహన, రక్తదానం చేయాలనే ఆసక్తిని చూసి ఆయన వారిని అభినందించారు. యువత ముందుకొస్తే రక్తనిల్వల కొరతను కొంతవరకు అధిగమించవచ్చని, అవసరమైన రోగులకు సకాలంలో రక్తం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మురళి, సత్య, సుమతి తదితరులు పాల్గొని శిబిరం నిర్వహణలో సహకరించారు. రక్తనిధి కేంద్రం ప్రయోగశాల సాంకేతిక నిపుణులు సాయితేజ, ఆంజనేయులు, వీరాంజనేయులు రక్తసేకరణ ప్రక్రియలో పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది, అర్హత కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి రక్తాన్ని సేకరించారు.

# భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ విగ్రహానికి వైసిపి బీసీ విభాగం వినతి!

**బీసీల రిజర్వేషన్లను అపహాస్యం చేయడం ద్వారా భారత రాజ్యాంగాన్ని అవమానించిన చంద్రబాబును కోర్టులు (ప్రాసిక్యూట్) అభిశంసించాలి!**

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నదని తెలిసి, గత వైసిపి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ జీవో తెచ్చినప్పుడు దానిపై హైకోర్టుకు వెళ్లి అడ్డం వేసి, తిరిగి నేడు అదే పద్ధతుల్లో హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లి న్యాయస్థానాల విలువైన కాలాన్ని, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన చంద్రబాబును న్యాయస్థానాలు ప్రాసిక్యూట్ చేయాలన్నారు. వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి నయవంచక విధానాలకు స్వస్తిపలకాలన్నారు. శుక్రవారం అనంతపురం వైయస్సార్సీపి బీసీ విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబుకు న్యాయస్థానాలన్నా, బహుజనులు అన్నా లెక్కలేని తనం అని అన్నారు. నిన్న బీసీల సమస్యలపై వినతిపత్రం అంద చేయాలని పోతే మీ తొక్క తీస్తా, తోలుతీస్తానని బీసీలను దగ్గరకు రానీయకుండా పోవడం, హరిజనుల ఇండ్లలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని మాట్లాడడం,



నేడు పరోక్ష ఎన్నికలు అయితే బహుజనులు పోటీ చేస్తారనే కుట్రతో డైరెక్ట్ ఎలక్షన్ కు వెళ్లడం. తిరుపతి లడ్డు నెయ్యిలో గొడ్డు మాంసం ఉన్నదని నిరాధారమైన ఆరోపణలతో తిరుమలను, దేవదేవుడైన వెంకటేశ్వరుని ప్రాముఖ్యతలను తగ్గించడం, నేడు సిబిఐ నిర్వహించిన సిట్ లడ్డు నెయ్యిలో ఎటువంటి కల్తీ లేదని తేల్చడం, అదే పద్ధతుల్లో రిజర్వేషన్లు 50 శాతాన్ని మించి చల్లదని తెలిసి డ్రామాలు ఆడటం బీసీల ఓట్లను కొల్లగొట్టడం. ఇలాంటి మోసగాళ్లు, నయవంచకులను వదిలేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతుంది. బీసీల పైన ప్రేమ ఉంటే తనతో అంటకాగుతున్న బిజెపి కేంద్రంలో అధికారం ఉన్న కారణంగా పార్లమెంటులో చట్టం చేసి, తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి తమ నిజాయితీని నిరూపించుకోవాలి. అంతేగాని ప్రజలను, న్యాయ స్థానాలను పక్కదోవ పట్టించ కూడదు. ఈ కుట్రలను గమనించిన బీసీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కీలెరిగి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ విభాగం రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, డిప్యూటీ మేయర్లు కొగటం భాస్కర్ రెడ్డి, రిలాక్స్ నాగరాజు, బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కెవి రమణ, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు కొగటం విజయ భాస్కర్ రెడ్డి, చింత సోమశేఖర్ రెడ్డి, ఓబిరెడ్డి, చామలూరు రాజ గోపాల్, సాకే చంద్ర శేఖర్, సంపంగి రామాంజనేయులు, ఎద్దుల అమర్నాథ్ రెడ్డి, వేముల నదీం, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, మొఘల్ సైపుల్లా బేగ్, ధన, సీఎం బాలాజీ, హేమ కిరణ్, నరేంద్ర, అంజలి, భారతి, కృష్ణవేణి, కమర్తాజ్, దేశాయి భారతీ రెడ్డి, రాధా యాదవ్, శోభా భాయ్, మాలపాటి శ్రీనివాసులు, శ్రీనివాస్ దత్తా, భారతి, మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగ రత్నమ్మ, పార్వతి, రామాంజనేయులు, ఫణీంద్ర, దేశాయి, భారతీ రెడ్డి, లబ్బె రాఘవ, శ్రీనివాసులు, శేఖర్, గోగుల పుల్లయ్య, రాధా యాదవ్, బెస్త వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

## -విద్యాశాఖ అధికారులకు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్
ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హిందూపురం పట్టణంలో




ఎంఈఓ-2 ప్రకాష్‌కు విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించిందని తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా కొన్ని విద్యాసంస్థలు సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తే, ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులను విద్యార్థులకు అమలు చేయకుండా నిరంతరం తరగతులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు విశ్రాంతి, మానసిక ప్రశాంతత కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. సెలవు రోజుల్లోనూ తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం, వారి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడేలా వ్యవహరించడం తగదని అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలంటే చదువుతోపాటు ఆటపాటలకు, కుటుంబ సభ్యులతో గడిపేందుకు తగిన సమయం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని బాబావలి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు అనుదీప్, రవీంద్ర, వలిసాబ్, హర్ష, దివాకర్, నవీన్, శశి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు బసవన్నపల్లి విద్యార్థులు

## -ఫుట్‌బాల్‌కు ఇద్దరు, రగ్బీకి ఒకరు..

ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం రూరల్ మండలంలోని కే. బసవన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు ఫుట్‌బాల్ క్రీడకు,




మరొకరు రగ్బీ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేసీ రవీంద్రారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కే. సురేష్ కుమార్, అరుణ వివరాలను వెల్లడించారు. అండర్--17 విభాగంలో ఫుట్‌బాల్ క్రీడకు తొమ్మిదో తరగతి విద్యార్థి ఉమేష్ బాబు, పదో తరగతి విద్యార్థిని దీక్ష ఎంపికయ్యారు. అలాగే రగ్బీ క్రీడకు పదో తరగతి విద్యార్థిని అమలజ ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఫుట్‌బాల్ క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే పోటీలకు హాజరుకానున్నారు. రగ్బీ క్రీడాకారిణి అమలజ ఈ నెల 12, 13 తేదీల్లో కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకుఎంపిక కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను పలువురు ప్రశంసించారు.

# వీవర్స్ కాలనీ నీటి సమస్యకు పరిష్కారం

## -నూతన బోరులో సమృద్ధిగా నీరు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర పంచాయతీ వీవర్స్ కాలనీలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల టిడిపి కన్వీనర్ హెచ్.ఎన్.రాము ద్వారా



హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కాలనీవాసులకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించడంతో శుక్రవారం బోరు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు కాలనీలో బోరు వేయగా, సుమారు 180 అడుగుల లోతులోనే ఒకటిన్నర అంగుళాల మేర నీరు లభించింది. దీంతో నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన టీడీపీ నాయకులకు కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఆంజనేయులు, అంజితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ప్రజా భూమి యల్లనూరు : మండల పరిధిలోని జంగంపల్లి గ్రామపంచాయతీ నందు పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో మనోహర్ బాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి క్షుణ్ణంగా పరిశీలించి రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రంలో ఎటువంటి సమస్యలు ఉన్నాయి అనే అంశాల పైన, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా తమ ఓటు హక్కు స్వేచ్ఛగా స్వచ్ఛందంగా వినియోగించేందుకు



వీలుగా ఇరువురు అధికారులు చర్చించడం జరిగింది.